



KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

TV6 NATIONAL NEWS CHANNEL

సంపుటి : 05 సంచిక : 352 పేజీలు : 08, వెల రూ. 5రూ/ బుధవారం - 28 - మే - 2025

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar. Warangal. Khammam. Nalgonda. Nizamaba


### ఎత్తిన జెండా దించకుండా కాపలా కాశారు

## ప్రతి కార్యకర్తకు పాదాభివందనాలు

- కడపలోని మహానాడు సభలో ప్రసగించిన మంత్రి నారా లోకేశ్
- 6 శాసనాలను మహానాడు వేదికగా ప్రవేశపెడుతున్నట్లు వెల్లడి
- కుల, మత, ప్రాంత అజెండాలతో అనేక పార్టీలు పుడితే తెలుగుజాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశమని స్పష్టం
- రైతు లేకపోతే రాష్ట్రం లేదని సమాజమే లేదనే నినాదంతో రైతుల జీవితాలు మార్చేందుకు ప్రాధాన్యం




అమరావతి : అధికారం, ప్రతిపక్షం మనకు కొత్త కాదని మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ కూడా మారాలని తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. పార్టీని మరో 40 ఏళ్లు నడిపించే కీలక విధానాలకు మహానాడు వేదిక కావాలని పిలుపునిచ్చారు. తన తెలుగు కుటుంబం పేరుతో 6 శాసనాలను మహానాడు వేదికగా ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ప్రత్యేకమైన కార్యాచరణ: తెలుగు జాతి విశ్వఖ్యాతి తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవ్యాపితం చేసేందుకు మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లి తెలుగువారు ఎక్కడున్నా, ఏ రంగంలో ఉన్నా నెం.1గా ఎదగాలనేది లక్ష్యమని వివరించారు. మహిళా సాధికారత, మహిళా శక్తిని చాటేలా స్త్రీశక్తి పేరుతో ఈ వర్గానికి మద్దతు ప్రకటిస్తున్నామని చెప్పారు. పేదరికం లేని సమాజం కోసం ఇప్పటికే పీ4 విధానాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నారని దీనికి అనుబంధంగా పేదరిక నిర్మూలనకు ప్రత్యేకమైన కార్యాచరణ అమలు చేస్తామని వెల్లడించారు. శాసనాలను ప్రతి ఒక్కరూ బలపరచాలి: పార్టీలో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అవసరమైన చర్యలు, ఐడియాలజీపై యువగళం తెస్తున్నామని తెలిపారు. రైతు లేకపోతే రాష్ట్రం లేదని సమాజమే లేదనే నినాదంతో రైతుల జీవితాలు మార్చేందుకు ప్రాధాన్యం

**6 శాసనాలు:**
తెలుగుజాతి-విశ్వఖ్యాతి,
యువగళం, స్త్రీ శక్తి, పేదల సేవ
సోషల్ రీ ఇంజినీరింగ్,
రైతులకు అండ, కార్యకర్తే
అధినేత

### టీడీపీ మహానాడుపై

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కామెంట్స్




- ★ మహానాడు ఒక చారిత్రక రాజకీయ వేడుక అని అభివర్ణన
- ★ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షులకు ప్రత్యేక అభినందనలు
- ★ మహానాడులోని ఆరు శాసనాలు ప్రశంసనీయమని వెల్లడి

అమరావతి :తెలుగుదేశం పార్టీ ఏటా నిర్వహించే మహానాడు చారిత్రక రాజకీయ వేడుక అని, అలాంటి పండుగ వాతావరణంలో నేడు (మంగళవారం)

### రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా

## పద్మా పురస్కారాల ప్రదానోత్సవం

రాష్ట్రపతి భవన్‌లో పద్మా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




## మహానాడు ఒక చారిత్రక రాజకీయ వేడుక

తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

కడపలో అంగరంగ వైభవంగా జరిగే మహానాడు చారిత్రక రాజకీయ పండుగ అని పవన్ కల్యాణ్ తెలిపారు.




అమరావతి: తెలుగుదేశం పార్టీ నిర్వహించే మహానాడు ఒక చారిత్రక రాజకీయ వేడుక అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. మహానాడు... ఈ పదం విన్నా, చదివినా వెంటనే గుర్తుకు వచ్చేది 'తెలుగు దేశం' పార్టీనే అని.. అంతలా తెలుగువారి గుండెల్లో స్థిరపడిపోయిందని

## కార్యకర్తలే మా అధినేతలు,

# వారే మా ప్రాణం...

## మహానాడు తొలిరోజు చంద్రబాబు ప్రసంగం

- కడపలో ప్రారంభమైన టీడీపీ మహానాడు, తొలిరోజు ప్రసంగించిన చంద్రబాబు
- పార్టీకి కార్యకర్తలే అసలైన యజమానులని ఉద్ఘాటన
- వారి త్యాగాలను వృథా పోనివ్వమని, అండగా ఉంటామని భరోసా
- సంక్షేమం, అభివృద్ధిలో టీడీపీ ఎప్పుడూ ముందుంటుందని వెల్లడి
- రాబోయే ఎన్నికల్లో కడప జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాలు గెలవాలని పిలుపు
- గత ప్రభుత్వ పాలనపై విమర్శలు, భవిష్యత్ ప్రణాళికల వెల్లడి

అమరావతి : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే నిజమైన అధినేతలని, పార్టీకి ప్రాణశక్తితో పాటు ఆయుధం కూడా వారేనని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంగళవారం కడపలో ప్రారంభమైన మహానాడు తొలిరోజు పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం, పహల్గాం దుర్ఘటన మృతులకు, ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన సైనికులకు, అలాగే పార్టీలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారిగా కడప గడ్డపై దీనిని నిర్వహించడం ఆనందంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే తన మనసు ఉప్పొంగుతోందని, వారి త్యాగాలను ఎప్పటికీ వృథా కానివ్వమని, వారికి అన్ని విధాలా అండగా నిలబడి సంక్షేమం అందిస్తామని హామీ




### ఆ వ్యక్తి రూ.100 కోట్లు ఇస్తా అన్నారు...

అదీ ఫారెన్ లో చంద్రబాబు రేంజ్!:




- కడపలో ఘనంగా టీడీపీ మహానాడు
- తొలిరోజు వేదికపై ప్రసంగించిన ఏపీ మంత్రి టీజీ భరత్
- చంద్రబాబు కష్టపడే లీడర్ అని కితాబు
- మన దగ్గర చంద్రబాబు విలువ తెలియడంలేదని వ్యాఖ్య
- కానీ, విదేశాల్లో ఆయనకు చాలా గొప్ప గుర్తింపు ఉందని వెల్లడి

అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు విలువ మన దగ్గర సరిగా గుర్తించడం లేదని, కానీ విదేశాల్లో ఆయనకు ఎంతో గుర్తింపు ఉందని

# కవిత సంచలనం నిర్ణయం..

- బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు తారా స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది.
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు రావడంతో మొదలైన ఈ పొలిటికల్ సైక్లోన్..
- మరింత తీవ్రంగా మారేలా కనిపిస్తోంది. ఎమ్మెల్సీ కవిత.. తన తండ్రి పార్టీని కాదని..




హైదరాబాద్, మే 27: బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు తారా స్థాయికి చేరుకున్నట్లు కనిపిస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ బయటకు రావడంతో మొదలైన ఈ పొలిటికల్ సైక్లోన్.. మరింత తీవ్రంగా మారేలా

## డిప్యూటీ సీఎం భట్టితో త్రిమెన్ కమిటీ భేటీ.. ఉద్యోగుల సమస్యలపై ఆరా

- ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి
- ఈ నెల 29వ తేదీన సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముగ్గురు సీనియర్ ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈరోజు ( మే 27వ తేదీ) మిగతా..2లో

## కాలం మారుతోంది

# రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వస్తున్నారు!

- రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు
- గ్రామాల్లో రైతు సదస్సుల నిర్వహణ
- పంటల సాగులో రైతులకు సూచనలు, సలహాలు
- సాగు ఖర్చులు తగ్గించుకోవడంపై అవగాహన సదస్సులు
- రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం




హైదరాబాద్ : వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఖరీఫ్ సీజన్ సమీపిస్తోన్న తరుణంలో తొలిసారిగా రైతుల వద్దకే శాస్త్రవేత్తలను పంపిస్తోంది. 'రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం' పేరుతో పంటల సాగులో మెళకువులు, సహా అనేక సూచనలు రైతులకు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు, వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలకు వెళ్లి రైతు సదస్సులు నిర్వహిస్తున్నారు. తద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవడం, నాణ్యమైన విత్తనాల ఎంపిక, రసాయ ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగంపై సలహాలు ఇస్తున్నారు.

మిగతా..2లో

## ఎత్తిన జెండా దించకుండా కాపలా కాశారు

## - ప్రతి కార్యకర్తకు పాదాభివందనాలు

మొదటి పేజి తరువాయి

ఇస్తున్నామని చెప్పారు. తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచీ వెన్నుదన్నుగా నిలుస్తున్న కార్యకర్తల సంక్షేమం కోసం, వారికి చేయూత అందించేలా ఐడియాలజీ రూపొందించామన్నారు. కుల, మత, ప్రాంత అజెండాలతో అనేక పార్టీలు పుడితే తెలుగుజాతి కోసం పుట్టిన ఏకైక పార్టీ తెలుగుదేశమని స్పష్టం చేశారు. ఈ 6 శాసనాలను ప్రతి ఒక్కరూ బలపరచాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలే నాకు నిత్య స్ఫూర్తి: స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ పెట్టిన ముహూర్త బలం గొప్పదని లోకేశ్ అన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం, బలగమని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పోరాడే కార్యకర్తలు తనకు నిత్య స్ఫూర్తి అని వెల్లడించారు. ఈ రోజు నుండి ప్రారంభం అవుతున్న పసుపు పండగ మహానాడుకు అందరికీ ఘన స్వాగతం పలుకుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన ఎక్స్‌లో విడుదల చేశారు.

# అక్రమాలపై సంచలన నివేదిక

మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అక్రమాలపై సీఎం రేవంత్ రెడ్డి అయిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంపై తెలంగాణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ తో విచారణకు ఆదేశించారు. కాగా విచారణ పూర్తిచేసిన విజిలెన్స్ అధికారులు తమ నివేదికను సీఎంకు అందజేశారు. అయితే ఈ నివేదికలో సంచలన నిజాలు ఉన్నట్టు సమాచారం. ఐపీఎల్ 2025 టికెట్ల వ్యవహారంలో అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు.

### తెలంగాణ నిరుద్యోగులకు బిగ్ అలర్ట్.. 'రాజీవ్ యువ వికాసం' అప్‌డేట్

హెచ్‌సీఏ సెక్రటరీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీపై ఒత్తిడి చేసి, ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగే మ్యాచ్‌లకు ఇప్పటికే 10 శాతం(3,900 టికెట్లు) ఉచితంగా ఇస్తున్నా.. మరో 10 శాతం టికెట్లు కూడా ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఈ విషయంలో యాజమాన్యం హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్ రావుపై బ్లాక్‌మెయిలింగ్ ఆరోపణలు చేసింది. మార్చి 27న మ్యాచ్ రోజున హెచ్‌సీఏ ఒక కార్పొరేట్ బాక్స్ ను లాక్ చేసి, అదనంగా 20 టికెట్లు ఇవ్వాలని ఒత్తిడి చేసిందని ఆరోపించింది.

### గడువు పొడగింపు

ఈ ఘటనలపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందించి, విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ కోటకోట శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో విచారణకు ఆదేశించారు. విజిలెన్స్ తన ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అందులో హెచ్‌సీఏ అక్రమాలు, టికెట్ల దుర్వినియోగం, అధిక ధరలకు విక్రయించడం వంటి విషయాలు ధృవీకరించారు. కాగా ఏప్రిల్ 2న హెచ్‌సీఏ, సన్ రైజర్స్ మధ్య చర్చలు జరిగి, 3,900 టికెట్ల ఒప్పందాన్ని కొనసాగించడానికి రెండు పక్షాలు అంగీకరించాయి. హెచ్‌సీఏ ఇకపై ఒత్తిడి చేయదని హామీ ఇచ్చింది.

## టీడీపీ మహానాడుపై

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కామెంట్స్

మొదటి పేజి తరువాయి

కడపలో ప్రారంభమైన మహానాడుకు తన తరఫున, జనసేన పార్టీ తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నానని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లకు పవన్ కల్యాణ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పార్టీకి సేవలందిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, బక్కని నరసింహులుకు కూడా ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. మహానాడు... ఈ పదం విన్నా, చదివినా వెంటనే గుర్తుకు వచ్చేది 'తెలుగు దేశం' పార్టీనే. అంతలా తెలుగువారి గుండెల్లో స్థిరపడిపోయింది ఏటా జరిగే మహానాడు వేడుక. ప్రజాసేవ, ప్రజా ప్రయోజనమే పరమావధిగా జరుగుతున్న ఈ మూడు రోజుల వేడుకలో చర్చించనున్న ఆరు అంశాలు ప్రశంసనీయంగా ఉన్నాయి. కార్యకర్తే అధినేత, యువ గళం, స్త్రీ శక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాతకు అండ వంటి అంశాలపై ఈ మహానాడులో చర్చించి అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించడం అభినందనీయం. పసుపు వర్ణంతో ముస్తాబైన మహానాడు ప్రాంగణం శోభాయమానంగా కనువిందు చేస్తోంది. ఈ వేడుక విజయవంతంగా జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను... అంటూ పవన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టితో త్రిమెన్ కమిటీ భేటీ..

# ఉద్యోగుల సమస్యలపై ఆరా

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో త్రిమెన్ కమిటీ అధికారుల సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలను డిప్యూటీ సీఎంకు వారు వివరించారు. ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన సమస్యలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు త్రిమెన్ కమిటీ అధికారులు వివరించారు.

48 గంటల ప్లేబ్యాక్ తో.. రియల్‌మీ కొత్త ఇయర్‌బడ్స్ విడుదల

అయితే, ఈ నెల 29వ తేదీన సబ్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఆ సమావేశంలో ఉద్యోగ సంఘాలు లేవనెత్తిన అంశాలు, వాటి పరిష్కారానికి సంబంధించిన సమాచారాన్ని సబ్ కమిటీ భేటీలో వివరించాలని అధికారుల కమిటీకి డిప్యూటీ సీఎం సూచనలు చేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సంబరాలు అంబరాన్ని అంటాలని చెప్పుకొచ్చారు. రాష్ట్ర కీర్తి ప్రతిబింబించేలా విజయోత్సవాలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు.

## రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా

# పద్మా పురస్కారాల ప్రదానోత్సవం

ఢిల్లీ: రాష్ట్రపతి భవన్‌లో పద్మా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పద్మ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అందజేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి మంద కృష్ణ మాదిగ, కెఎల్ కృష్ణ, వదిరాజ్ రాఘవేంద్రాచార్య పంచముఖి తదితరులు పద్మ అవార్డులు అందుకోనున్నారు. కళ, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్, ఇంజనీరింగ్, వాణిజ్యం, పరిశ్రమ, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, పౌర సేవ వంటి విభిన్న రంగాలలో విశేష సేవలు అందించిన వారికి పౌర పురస్కారాలతో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. మొత్తం 139 మందిని కేంద్రం ప్రభుత్వం ఈ సంవత్సరం పద్మ పురస్కారాలకు ఎంపిక చేసింది. ఏడు పద్మ విభూషణ్, 19 పద్మ భూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. మొదటి విడతలో భాగంగా 71 మంది ప్రముఖులకు ఈ అవార్డులను రాష్ట్రపతి ప్రదానం చేశారు. రెండవ విడతలో భాగంగా 68 మందికి పద్మా పురస్కారాలు అందజేశారు. కాగా, ఇవాళ(మంగళవారం) ముగ్గురు పద్మ విభూషణ్ పురస్కారం అందుకోగా.. మరో తొమ్మిది మంది పద్మభూషణ్ అవార్డును అందుకున్నారు. అలాగే, మరో 56 మంది పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు.

## మహానాడు ఒక చారిత్రక రాజకీయ వేడుక



ప్రతి ఏటా జరిగే మహానాడు వేడుక అని ఉద్ఘాటించారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. రాయలసీమ గడ్డపై... కడపలో అంగరంగ వైభవంగా జరిగే మహానాడు చారిత్రక రాజకీయ పండుగ అని వెల్లడించారు. ఈ శుభవేళ తన పక్షాన, జనసేన పార్టీ పక్షాన తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌లకి పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులుగా సేవలు అందిస్తున్న పల్లా శ్రీనివాస్, బక్కని నరసింహులకు శుభాభినందనలు తెలిపారు. ప్రజాసేవ, ప్రజా ప్రయోజనమే పరమావధిగా జరుగుతున్న ఈ మూడు రోజుల వేడుకలో చర్చించనున్న ఆరు అంశాలు ప్రశంసనీయంగా ఉన్నాయని కొనియాడారు. కార్యకర్తే అధినేత, యువగళం, స్త్రీ శక్తి, సామాజిక న్యాయం, పేదల ప్రగతి, అన్నదాతకు అండ వంటి అంశాలపై ఈ మహానాడులో చర్చించి అందుకు తగిన విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించడం అభినందనీయమని ప్రశంసించారు. పసుపు వర్ణంతో ముస్తాబైన మహానాడు ప్రాంగణం శోభాయమానంగా కనువిందు చేస్తోందని అన్నారు. ఈ వేడుక విజయవంతంగా జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఆ వ్యక్తి రూ.100 కోట్లు ఇస్తా అన్నారు... అదీ ఫారెన్ లో చంద్రబాబు రేంజ్!:

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కడపలో టీడీపీ రాష్ట్ర మహానాడు వేదికగా టీజీ భరత్ ఆసక్తికరంగా ప్రసంగించారు. "సీఎం చంద్రబాబు గారు మన దగ్గర ఉంటే మనకు విలువ తెలియడం లేదు. బయటి దేశాల్లో ఆయన విలువ చాలా ఎక్కువ. నేను ఈ మధ్య ఇండియా టుడే కాంక్లేవ్ కోసం దుబాయ్ వెళ్లాను. శోభ బిల్డర్స్ అధినేత... సీఎం చంద్రబాబు గారికి పరిచయం లేదు, చూసింది లేదు, కలిసింది లేదు. ఓ సందర్భంలో మాట్లాడుతూ రూ.100 కోట్లు ఏపీకి విరాళంగా ఇవ్వాలనుకుంటున్నా అన్నారు. చంద్రబాబు లాంటి సరైన నాయకుడు మీకు ఉన్నాడు. ఆ రూ.100 కోట్లు ఏ విధంగా ఉపయోగించుకుంటారో వినియోగించుకోండని తెలిపారు. చంద్రబాబు గారు ఏ విధంగా కష్టపడుతున్నారో మనందరికి తెలియాలి. కష్టపడే లీడర్ మనకు ఉన్నారు. దీనిని మనం సద్వినియోగం చేసుకోవాలి" అని టీజీ భరత్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ విధానాల వల్ల పారిశ్రామిక వేత్తలు ఎంత బాధపడ్డారో అందరికీ తెలుసు. ఏపీలో పెట్టుబడులు పెట్టకండని ఫారెన్ కంపెనీలు మన ఏపీని బ్లాక్ లిస్ట్ లో పెట్టారు. ఆ విధంగా గత వైసీపీ ప్రభుత్వ పాలన సాగింది. టీడీపీ ప్రభుత్వం వచ్చాక స్వాతంత్ర్యం వచ్చిందని కొందరు పారిశ్రామిక వేత్తలు నాతో చెప్పారు. మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రముఖ కంపెనీలకు చెందిన పారిశ్రామిక వేత్తలు వస్తే మనం ఎయిర్ పోర్ట్ కు వెళ్లి స్వాగతిస్తాం.. కానీ గత వైసీపీ హయాంలో పెట్టుబడిదారులను దారుణంగా అవమానించారు. గత ప్రభుత్వంలో టెక్స్ టైల్స్ పాలసీ ఇచ్చి గైడ్ లైన్స్ ఇవ్వలేదు. గైడ్ లైన్స్ మనం అధికారంలోకి వచ్చాక ఇచ్చాం. గత ప్రభుత్వంలో అంత ఘోరంగా పారిశ్రామిక వేత్తలను అవమానించారు. ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డుకు వైసీపీ హయాంలో 10 మందికే పరిమితం చేశారు. 2014-19 లో 60 మందితో పనిచేశాం. నేడు దాదాపు 50 మంది పనిచేస్తున్నారు. మన విధానాలు ప్రమోట్ చేయడంలో ఈ బోర్డు పనిచేస్తుంది. ఇప్పుడు కూడా ఒక బోర్డు జపాన్ లో పర్యటిస్తోంది. మన ప్రభుత్వం వచ్చాక అన్ని పాలసీలు, గైడ్ లైన్స్ తీసుకొచ్చాం. చంద్రబాబు గారు ఎప్పుడు స్పీడ్ అప్ డూయింగ్ బిజినెస్ పై చెబుతారు. ఒక కంపెనీ ఏర్పాటు కావడం ఆలస్యం అయితే వడ్డీ ఎక్కువగా పెరిగిపోతుంది. ఉదాహరణకి కర్నూల్ లో ఉన్న జైరాజ్ స్టీల్స్ ప్రాజెక్ట్ ఆలస్యం కావడంతో కొన్ని కోట్లు వడ్డీలే సరిపోతుంది. రూ.9.40 లక్షల కోట్ల పెట్టుబడులు ఈ ఏడాదిలో మనం సాధించాం. రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టే కంపెనీ ఉంటే త్వరగా అనుమతులు ఇచ్చి పనులు ప్రారంభింపజేసేలా పాలన సాగిస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయబోతున్నాం. ఇప్పటికే 11 ప్రారంభించాం. 39 పార్కులకు ఫౌండేషన్ వేశాం. 20 లక్షల ఉద్యోగాలు సాధించే దిశగా పనిచేస్తున్నాం. కాస్త ఓపికతో ఉండండి. కచ్చితంగా ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం" అని టీజీ భరత్ వివరించారు.

# కార్యకర్తలే మా అధినేతలు, వారే మా ప్రాణం...

మొదటి పేజి తరువాయి

### కార్యకర్తల పోరాటమే అద్భుత విజయానికి కారణం

2024 ఎన్నికల్లో పార్టీ సాధించిన అసాధారణ విజయం కార్యకర్తల పోరాట పటిమ, త్యాగాల వల్లే సాధ్యమైందని చంద్రబాబు అన్నారు. 93 శాతం స్ట్రైక్ రేట్‌తో, 57 శాతం ఓట్ల వాటాతో చరిత్ర సృష్టించామంటే దానికి పసుపు సైనికులే కారణమని కొనియాడారు. జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేయడం కూడా ఈ భారీ విజయానికి దోహదపడిందని తెలిపారు. దశాబ్దాలుగా పార్టీ జెండాను మోస్తున్న కార్యకర్తల వల్లే తాము ఈ స్థాయిలో ఉన్నామని, ఈ విషయాన్ని ప్రతి నాయకుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. "43 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలను మనం ఎదుర్కొన్నాం. పార్టీ పని అయిపోయిందన్న వారి పనే అయిపోయింది కానీ, టీడీపీ జెండా రెపరెపలాడుతూనే ఉంది," అని చంద్రబాబు ఉద్వేగంగా అన్నారు. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని, హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిని ప్రశ్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను వేధించారని, అయినా ఎవరూ జెండా దించలేదని గుర్తుచేశారు. "మన పసుపు సింహం చంద్రయ్య గొంతు కోస్తున్నా జై తెలుగుదేశం అంటూ ప్రాణాలు వదిలారు. అలాంటి ఎందరో కార్యకర్తల త్యాగాల వల్లే కూటమి అధికారంలోకి వచ్చింది. మీ త్యాగాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను," అని చంద్రబాబు తెలిపారు.

### పాలనలో టీడీపీనే ట్రెండ్ సెట్టర్

సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలనలో తెలుగుదేశం పార్టీయే ట్రెండ్ సెట్టర్ అని చంద్రబాబు అన్నారు. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు నుంచి మహిళలకు ఆస్తిహక్కు వరకు, రూ.2కే కిలో బియ్యం నుంచి పక్కా ఇళ్ల వరకు, రూ.30 పింఛన్ నుంచి నేటి రూ.4000 పింఛన్ వరకు అనేక కార్యక్రమాలకు టీడీపీనే శ్రీకారం చుట్టిందని వివరించారు. దీపం పథకం, డ్వాక్రా సంఘాల సాధికారత, ఐటీ ఉద్యోగాల కల్పన, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అధికారం కల్పించడం వంటివి టీడీపీ ఘనతలేనని పేర్కొన్నారు. "ఒక వర్గం, ఒక ప్రాంతం అని కాదు, ఏ అంశమైనా పసుపు జెండా పుట్టకముందు, పుట్టిన తర్వాత అని గీత గీసి చెప్పే పరిస్థితి ఉంది" అని ఆయన



వ్యాఖ్యానించారు. 45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి ఒక ప్రాంతీయ పార్టీగా రికార్డు సృష్టించామని గుర్తుచేశారు.

### అవినీతిపై రాజీలేని పోరాటం, భవిష్యత్ ప్రణాళికలు

తాను నిత్య విద్యార్థినని, ప్రతిరోజూ నేర్చుకుని ప్రజలకు సేవ చేస్తానని చంద్రబాబు తెలిపారు. అవినీతిపై టీడీపీ మొదటి నుంచీ రాజీలేని పోరాటం చేసిందని, ఉమ్మడి రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం నుంచి నిన్నటి విధ్వంస పాలన వరకు ఇది కొనసాగిందని అన్నారు. ఓబుళాపురం అక్రమ మైనింగ్‌పై తాము చేసిన ఉద్యమం ఫలితాలు నేడు కనిపిస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వ అవినీతిపై విచారణకు ఆదేశాలిచ్చామని, దోచుకున్న సొమ్మును కక్కిస్తామని హెచ్చరించారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. పోలవరం పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరిస్తామని, గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. "ఆ రోజు నేను హైటెక్ సిటీ నిర్మించి హైదరాబాద్‌లో ఐటీ తెచ్చాను. ఈ మహానాడు ద్వారా క్వాంటమ్ వ్యాలీ, ఏఐకి ప్రాధాన్యత ఇచ్చి తెలుగుజాతిని ముందుకు నడిపిస్తాను" అని ప్రకటించారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర సాధన, ప్రతి ఒక్కరి ఆదాయం రూ.55 లక్షలకు పెంచడం, జీరో పావర్టీ సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు.

### సంక్షేమ పథకాలు, పెట్టుబడులు

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని చంద్రబాబు తెలిపారు. 64 లక్షల మందికి రూ.4 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందిస్తున్నామని, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభించామని, దీపం పథకం ద్వారా కోటి మందికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభిస్తామని ప్రకటించారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని, త్వరలో తల్లికి వందనం అందిస్తామని తెలిపారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, 11 నెలల్లో 76 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపి రూ.4 లక్షల 96 వేల కోట్ల పెట్టుబడులు, 4 లక్షల 57 వేల ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు. పెద్ద నోట్లు రద్దు చేస్తేనే దేశంలో అవినీతి పోతుందని, తాను ఈ మేరకు ప్రధానికి నివేదిక ఇచ్చానని గుర్తుచేశారు.

### సీమ అభివృద్ధి, పార్టీ బలోపేతం

రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చింది టీడీపీయేనని, తెలుగుగంగ, కేసీ కెనాల్, హంద్రీనీవా వంటి ప్రాజెక్టులు పూర్తిచేశామని చంద్రబాబు అన్నారు. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లులను పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పార్టీలో కింది స్థాయి నుంచి నాయకత్వాన్ని బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, పార్టీకి అనుసంధానం పెరగాలని, దానికి ఈ మహానాడు వేదిక కావాలని ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో కడప జిల్లాలో 10కి 10 అసెంబ్లీ స్థానాలు గెలుచుకోవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను, తెలుగుజాతిని దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపే వరకు నిరంతరం పనిచేస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు.

# కాలం మారుతోంది - రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వస్తున్నారు!

మొదటి పేజి తరువాయి

ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా : వర్షాకాలం ఈసారి ముందుగానే మొదలైంది. ప్రతిసారి మాదిరిగానే రైతులు తమ పొలాలను చదును చేశారు. ఈ నేపథ్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యవసాయశాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా పంట దిగుబడి పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. రైతులను చైతన్యపరుస్తూ : నకిలీ విత్తనాలు, మోతాదుకు మించి ఎరువులు వాడకుండా రైతులకు ఆదాయం పెంచే మార్గాలను శాస్త్రవేత్తలు రైతులకు చెబుతున్నారు. మే 5న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 13 వరకు జరుగుతుంది. ఇందులో భాగంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులు, పంటల మార్పిడి, ఎరువులు, పురుగుమందులు తగ్గించడం, సాగునీటి ఆదా, పర్యావరణ పరిరక్షణ, ఇతర సామాజిక అంశాలపై రైతులను చైతన్యపరుస్తున్నారు. రాష్ట్రంలోని సుమారు 1200 రెవెన్యూ గ్రామాల్లో 400 మంది శాస్త్రవేత్తలు పలు బృందాలుగా ఏర్పడి పర్యటిస్తున్నారు. దక్షిణ వ్యవసాయ మండలాల్లో సుమారు 100 మంది శాస్త్రవేత్తల బృందాలు పర్యటిస్తున్నాయి. ఉత్తర, మధ్య తెలంగాణ మండలాల్లో సుమారు 50 చొప్పున శాస్త్రవేత్తల బృందాలు క్షేత్రస్థాయిలో అన్నదాతలతో మమేకం అవుతున్నారు. "రైతులు సంప్రదాయ వ్యవసాయం చేసుకుంటూనే వారి జీవనాన్ని గడుపుతున్నారు. అనుభవజ్ఞులైన రైతులు, శాస్త్రవేత్తలు కలిసి వారి ఆలోచనలు పంచుకుంటే వ్యవసాయంలో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. శాస్త్రవేత్తలు, విద్యార్థులు గ్రామాల్లో




పర్యటించి పంటలపై చేసిన ప్రయోగాల వల్ల సాధించిన ఫలితాలపై అవగాహన కల్పిస్తున్నారు" -తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రి ప్రతి బృందంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, వెయ్యి మంది వ్యవసాయ విద్యార్థులు, ఇతర స్థానిక ప్రభుత్వ శాఖల సిబ్బంది, అభ్యుదయ రైతులు పాల్గొంటున్నారు. ఈ ప్రోగ్రామ్‌లో పలు వ్యవసాయ, పాలిటెక్నిక్ కళాశాలలు, పరిశోధన సంస్థలు, కృషి విజ్ఞాన, ఏరువాక కేంద్రాలు భాగమవ్వడం విశేషం. రైతులు పడుతున్న ఇబ్బందులు, పంట దిగుబడి, నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వాటిని పరిష్కరించేలా తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. శాస్త్రవేత్తల బృందం గ్రామ రైతులతో భేటీ : రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం ప్రతి రోజు ఉదయం 8 గంటలకు మొదలై మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతోంది. ముందుగానే ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతు వేదికలు లేదా వెసులుబాటు కలిగిన ప్రదేశాల్లో శాస్త్రవేత్తల బృందం గ్రామ రైతులతో భేటీ అవుతోంది. రసాయనాల కారణంగా నేల ఆరోగ్యం దెబ్బతిని భూసారంపై ప్రభావం పడుతుందని అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్నారు. పంట నష్టం నుంచి రైతులు బయటపడేందుకు నాణ్యమైన విత్తనాలను అధీకృత డీలర్ వద్ద కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. సాగునీరు, ఉచిత విద్యుత్‌ను అవసరం మేర వాడుకోవాలని చెబుతున్నారు. ఎక్కువ సార్లు ఒకే పంట వేయకుండా పంటమార్పిడి విధానాలను అవలంబించాలని అన్నదాతలను కోరుతున్నారు రైతుల నుంచి విశేష స్పందన : ప్రతి గ్రామంలో ఇద్దరు శాస్త్రవేత్తలు, మరో ఇద్దరు వ్యవసాయ విద్యార్థులు, క్షేత్రస్థాయిలోని వ్యవసాయ అధికారులతో కూడిన బృందం పర్యటిస్తోంది. గ్రామాల్లో రైతుల నుంచి విశేష స్పందన వస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. రైతుల నుంచి పంటల బీమా విత్తనాలు, మార్కెటింగ్ సమస్యలు తెలుసుకుంటున్నట్లు వివరించారు. రైతులు పంట మార్పిడిలో భాగంగా పామాయిల్ సహా ఇతరత్రా పంటలు వేయాలని సూచించారు. 12వందల గ్రామాల్లో 40వేల మంది రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు.

# కవిత సంచలనం నిర్ణయం..

మొదటి పేజి తరువాయి

ఇదే విషయాన్ని కేసీఆర్ పంపిన దూతలకు కూడా తేల్చి చెప్పారట. అంతేకాదు.. జూన్ 2న కొత్త పార్టీపై ప్రకటన వచ్చే అవకాశం ఉందని జాగృతి నేతలు బయట ప్రచారం చేస్తున్నారు. దీంతో ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారింది. బీఆర్ఎస్ పార్టీలో తనకు ప్రాధాన్యత దక్కడం లేదనే అసంతృప్తితో ఎమ్మెల్సీ కవిత ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఆమె ఏ సభ, సమావేశాల్లో పాల్గొన్నా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే విధంగానే కామెంట్స్ చేస్తూ వచ్చారు. తాజాగా బీఆర్ఎస్ వరంగల్ సభ తరువాత పార్టీ తీరుపై కేసీఆర్‌కే నేరుగా లేఖ రాశారు. ఈ లేఖ లీక్ అవడంతో.. తెలంగాణ రాజకీయం షేక్ అయ్యింది. ఆ తరువాత పరిణామాలు కూడా చాలా హీట్ క్రియేట్ చేశాయి. అమెరికా నుంచి వచ్చిన కవిత.. ఎయిర్‌పోర్టులోనే మీడియాతో మాట్లాడారు. ఆ లేఖ తాను రాసిందేనని కన్ఫామ్ చేసిన ఆమె.. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయంటూ బాంబ్ పేల్చారు. ఇక కవిత లేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం స్పందించారు. కవితకు పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు.

దూతలతో మంతనాలు..

పరిస్థితులు చేయి దాటిపోతుండటంతో కవిత వద్దకు కేసీఆర్ తన దూతలను పంపించారు. కవిత అసంతృప్తికి గల కారణాలపై చర్చించారు. అయితే, వీరి చర్చలు సైతం విఫలమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తనకు బీఆర్ఎస్ పార్టీలో ప్రాధాన్యత






లేకుంటే తన దారి తాను చూసకుంటానని కేసీఆర్‌కు కవిత స్పష్టం చేశారట. కొత్త పార్టీ కూడా పెట్టే ఆలోచనలతో ఉన్నట్లు స్పష్టం చేశారట.

జూన్ 2న కొత్త పార్టీ..

ఇదిలా ఉంటే.. కవిత బీఆర్ఎస్‌ను వీడి కొత్త పార్టీ పెడతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్‌లో తనకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని.. ఇక ఆ పార్టీలో ఉండాలనుకోవడం లేదని ఆమె అనుచరులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కవిత వరుసగా పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారని అంటున్నరు. ఇప్పటికే జాగృతిని విస్తరిస్తూ పలు కొత్త కమిటీలను కవిత ఏర్పాటు చేశారు. వరుసగా జాగృతి నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ కమిటీలను ప్రకటిస్తున్నారు. మంగళవారం నాడు సింగరేణి జాగృతి కమిటీని కవిత ప్రకటించారు. తొమ్మిది మంది కన్వీనర్లను నియమించారు. బహుజన సామాజిక న్యాయం ట్యాగ్ లైన్‌తో ప్రజల్లోకి వెళ్లాలని కల్వకుంట్ల కవిత భావిస్తున్నట్లు ఆమె అనుచరులు చెబుతున్నారు.

### ప్రతిపక్షాలు సైతం..

కవిత కొత్త పార్టీ పెడతారని.. జూన్ 2వ తేదీన కొత్త పార్టీని ఆమె ప్రకటిస్తారని ప్రతిపక్ష పార్టీల నేతలు సైతం చెబుతున్నారు. బీఆర్ఎస్ పార్టీలో చీలిక ఖాయం అని, కేటీఆర్ నాయకత్వాన్ని కవిత అంగీకరించడం లేదంటున్నారు. ఈ కారణంగానే ఆమె సొంత పార్టీ పెట్టబోతున్నట్లు ప్రత్యర్థి పార్టీల నేతలు అంటున్నారు.

# సంపాదకీయం

## యుద్ధలాభం ఆయుధ వ్యాపారులకే

పహల్గామ్ ఉగ్ర దాడి తరువాత సంభవించిన పరిణామాలు విస్తృత చర్చకు దారితీశాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కూడా స్వాధీనం చేసుకోడమే తమ ధ్యేయమన్న బీజేపీ నాయకుల సారథ్యంలో భారత్ వెనక్కి తగ్గిందనే ప్రచారం సాగింది. దీనిని తుడిచిపెట్టడానికి ఆపరేషన్ సిందూర్ విజయాన్ని చాటుతూ దేశమంతా ఊరేగింపులు జరిగాయి. వాస్తవంలో పూర్తిస్థాయి యుద్ధం దరిదాపులకు వెళ్లిన భారత, పాకిస్థాన్‌లు ఉన్నపళంగా ఘర్షణలను విరమించుకున్నాయి. ఇది సిమ్లా ఒప్పందం మేరకు రెండు దేశాల మధ్య చర్చల ద్వారానే జరిగిందని తాజాగా ప్రకటించుకున్నప్పటికీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చొరవతోనే యుద్ధం ఆగిందన్న సమాచారం మెరుపు వేగంతో వ్యాపించింది. అప్పుడు దానిని రెండు దేశాల పాలకులూ తక్షణమే ఖండించలేదు. యుద్ధమే జరిగితే సంభవించబోయే ఘోర పరిణామాల గురించి వివరించనక్కరలేదు. అటువంటి భయానక స్థితిని తొలగించినందుకు, భారత పాకిస్థాన్ పాలకులను ఇందుకు ఒప్పించినందుకు అమెరికా అధ్యక్షుడిని అభినందించడంలో తప్పు లేదు. అయితే ఇంతటితో యుద్ధ భాష ఆగకపోడమే ఆందోళనకరం. పరస్పరం పిప్పి, పిండి చేసుకోవాలన్న 'మీసాల' మెలివేత కొనసాగుతూనే ఉంది. ఇది రెండు దేశాల పాలకులు తమ ప్రజల్లో పొరుగు దేశం పట్ల ద్వేషాన్ని మరింతగా పెంచి రాజకీయంగా లాభపడడానికి పాటిస్తున్న వ్యూహమే. దీనివల్లనే శాశ్వత చర్చలకు ఆటంకం కలుగుతున్నది. ఇక్కడే మరొక బాధాకర పరిణామం%-%1971లో బంగ్లాదేశ్ అవతరణకు దారితీసిన యుద్ధంలో అమెరికాను సైతం ధిక్కరించిన ఇందిరాగాంధీతో మోదీని పోల్చుతున్నారు. తూర్పు, పశ్చిమ పాకిస్థాన్ల మధ్య తలెత్తిన ఆ యుద్ధం వల్ల లక్షలాదిమంది తూర్పు పాకిస్థానీయులు మన దేశంలోకి పారిపోయి రాడంతో ఇందిరాగాంధీ భారత దళాలతో ముక్తిబాహినిని సృష్టించి బంగ్లాదేశ్ అవతరణకు తోడ్పడ్డారు. అయితే ఆ యుద్ధం వల్ల సంభవించిన మానవ శోకం చెప్పనలవి కానిది. మోదీ పాకిస్థాన్‌ను ఆ విధంగా ఓడించ లేకపోయారని అనడం యుద్ధ పిపాసనే సూచిస్తున్నది. ఇది తమ ఓటు బలాన్ని తగ్గిస్తుందని, చేరువలో ఉన్న బిహార్ ఎన్నికల్లో దెబ్బ తింటామని బీజేపీ భయపడుతున్నది. అంతేగాని పూర్తి స్థాయి యుద్ధానికి వెళ్లకుండా నిగ్రహం పాటించినందుకు సంతోషించడం లేదు. ఆపరేషన్ సిందూర్ ద్వారా మోదీ పాకిస్థాన్ పీచమణిచారన్న అభిప్రాయాన్నీ బలంగా నాటుతున్నారు. పాకిస్థాన్‌ను మోకాళ్ళ మీదకు తెచ్చామని ఆయన కూడా ప్రకటించారు. ఈ అవకాశం, ఈ స్వేచ్ఛ తమకు ఇచ్చినందుకు భారత దళాలు ప్రధాని మోదీకి మొక్కుతున్నాయి అనేవారూ బయలుదేరారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఇంతవరకూ జరిగిన నాలుగు యుద్ధాల్లో అసంఖ్యాకంగా సైనికులు మరణించారు. ఆయుధాలకోసం రెండు దేశాలు విశేషంగా డబ్బు తగలబెట్టాయి. భారత ఉపఖండంలో రాజకీయం ఇప్పటికీ మతోన్మాదం ప్రాతిపదికనే కొనసాగుతున్న మాట కాదనలేని సత్యం. కశ్మీర్ పరిణామాలకూ అదే ఇంధనమవుతున్నది. హిందూత్వ రాజకీయాల మత కోణం దేశ ప్రజల మధ్య సృష్టిస్తున్న విభజన గురించి వివరించనక్కరలేదు. మతపరంగానో, సరిహద్దు వివాదం పరంగానో యుద్ధం తలెత్తితే అవతలి దేశాన్ని చీల్చి చెండాడాలని, దాన్ని నామరూపాలు లేకుండా చేసేయాలని పళ్ళు పటపటా కొరకడాన్ని అటూ ఇటూ గల ప్రజలకు అలవాటు చేశారు. భారత సైనిక దళాల మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవానే యుద్ధాన్ని గురించి కొద్ది రోజుల క్రితమే మంచి మాటలు చెప్పారు. యుద్ధాలు బాలీవుడ్ సినిమాలు కావన్నారు, యుద్ధాల్లో ఎంతమంది చనిపోతారో, మరెంతమంది వికలాంగులై జీవితాంతం ఎడతెగని వ్యథను అనుభవిస్తారో గుర్తు చేశారు. కురుక్షేత్రం లాంటి యుద్ధ గాథలు సినిమాల్లో, నాటకాల్లో చూడ్డానికే బాగుంటాయి. ఒకరినొకరు నరుక్కోడం, శత్రువు రొమ్ము చీల్చి రుధిరమ్ము తాగడం వాస్తవంలో ఎంతమాత్రం కోరదగినవి కావు. ఇప్పుడు సరిహద్దుల రక్షణలో కన్నార్పకుండా కాపలా కాస్తున్నవారిలో, యుద్ధాల్లో ప్రాణాలు విడుస్తున్నవారిలో అత్యధికులు పేద బహుజనులే. ఉపాధి కరువై పొట్ట కూటి కోసం సైన్యంలో చేరుతున్నవారే ఎక్కువమంది. పహల్గాం ఉగ్ర దాడి బహు హేయమైనది. ఈ ఉన్మాదులు భారత, పాకిస్థాన్‌లు చేరువ కాకుండా అన్ని తంత్రాలను ప్రయోగిస్తున్నారు. రెండు దేశాల మధ్య మతపరమైన దూరాన్ని పెంచి దాన్ని అధిగమించడానికి వీలు లేని స్థాయికి తీసుకువెడుతున్నారు. భారత వ్యతిరేక ఉగ్రశక్తులకు పాకిస్థాన్ సైన్యం అండదండలు లభిస్తున్నాయి. అది పాక్ ప్రేరిత ఉగ్రవాదమే. అయితే ఈ విషయాన్ని మనం నమ్ముతున్నంతగా మిగతా ప్రపంచం నమ్మడం లేదు. మిగతా దేశాలు భారత్, పాకిస్థాన్లను ఒకేలా చూస్తున్నాయి. ఈ విషయాన్ని భారత పాలకులు తెలుసుకోవాలి. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌ను భారత్ గట్టి దెబ్బే తీసింది. అంతటితో ఆగకుండా పాకిస్థాన్ నిజస్వరూపాన్ని తెలియజేయడానికి దేశ దేశాలకు పార్లమెంటు సభ్యుల బృందాలను పంపించడం బాగుంది. అయితే అది కూడా రాజకీయ విభేదాలకు దారి తీయడం బాధాకరం. పాకిస్థాన్‌పై బలంగా విరుచుకుపడ్డాం గాని పహల్గాం దాడి ముష్కరులను కనుక్కోడంలో జాప్యం జరుగుతున్నది. వారెవరో స్పష్టంగా తెలిస్తే బాగుంటుంది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలని భావిస్తున్న దేశాల ప్రజలు యుద్ధోన్మాదంతో వూగిపోడం సరైనది కానే కాదు. ఇది రక్షణ ఖర్చును ఆకాశానికి చేర్చి ప్రజలను కనీస విద్య, వైద్యం కూడా దొరకని దారిద్ర్యంలో కూరుకుపోయేలా చేస్తుంది. వాస్తవానికి టెర్రరిజం సమస్య చాలా లోతైనది. ప్రపంచ పాలకులు ముఖ్యంగా అమెరికా ఇజ్రాయెల్ వంటి దేశాలు చిత్తశుద్ధితో ఆలోచిస్తే వాటి అసలైన మూలాలు కనిపిస్తాయి. భారత పాకిస్థాన్‌లకూ ఇదే వర్తిస్తుంది. టెర్రరిజం గాని, వామపక్ష ఉగ్రవాదం గాని ఊరకే ఆకాశం నుంచి ఊడిపడేవి కావు. మెజారిటీ, మైనారిటీలు హాయిగా శాంతియుత సహజీవనం

## కె నరేష్ కుమార్ముంబై' చెప్తున్నదేమిటి?!

'కుండపోతలతో వస్తున్నాం... కాచుకోండ'న్నట్టు హెచ్చరిస్తూ ప్రవేశించాయి నైరుతి రుతుపవనాలు. సోమవారం వేకువజామునే కళ్లు తెరిచిన ముంబై మహానగరవాసులు... వస్తూనే తడాఖా చూపించిన భారీ వర్షాన్ని చూసి బిత్తరపోయారు. సాధారణ సమయాల్లో గంభీరంగా, కళ్లు చెదిరేలా కనబడే మన నగరాలు చినుకు రాలితే ఎంత అల్లకల్లోలమవుతాయో మొన్నీ మధ్యే బెంగళూరు నగరం కూడా నిరూపించింది. మన్నూ మిన్నూ ఏకమైనట్టు ధారాపాతంగా రాత్రంతా కురియటంవల్ల 200 మిల్లీ మీటర్ల(ఎంఎం) మించిన వర్షపాతంతో ముంబై నగరం తాజాగా తడిసిముద్దయింది. ఆ నగరానికి ముందుగా జారీచేసిన 'యెల్లో అలెర్ట్'ను కాస్తా 'రెడ్ అలెర్ట్'గా సవరిస్తూ, ముంబైతోపాటు దాని ఇరుగుపొరుగునున్న జిల్లాల్లో సైతం పిడుగులతో, పెనుగాలులతో అత్యంత భారీ వర్షం ముంచుకు రాబోతున్నదని భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. ముంబై పొరుగునున్న కొలాబాలో సోమవారం 295 ఎంఎం వర్షపాతం నమోదై, 107 ఏళ్లనాటి... అంటే 1918 నాటి రికార్డు 279.4 ఎంఎంను అధిగమించింది. ఇంకా కర్ణాటకలోని మంగళూరు నగరం, దక్షిణ కన్నడ జిల్లాలు సైతం భారీవర్షాలతో ఇక్కట్లుపడ్డాయి. కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు పది రోజులకు మహారాష్ట్ర రావాల్సివుండగా కేవలం 24 గంటల్లో అక్కడికి లంఘించాయి. ముంబైకి ఆ మర్నాడే చెప్పాపెట్టకుండా వచ్చాయి. సరిగ్గా అయిదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ ఎర్త్ సైన్స్ విభాగం ఒక ఆసక్తికర ప్రకటన చేసింది. ప్రతియేటా అంతక్రితంతో పోలిస్తే భారీ వర్షాలు నమోదవుతున్నాయన్నదే దాని సారాంశం. ఇలాంటి ప్రకటనలు మన పాలకుల్ని అప్రమత్తుల్ని చేయాలి. ఏటా నగరాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలి. వాటి వికేంద్రీకరణకు ప్రణాళికలు రూపొందించాలి. కానీ తరచు నడుంలోతు నీళ్లల్లో మునకలేస్తున్న నగరాలను చూస్తుంటే వారికంత శ్రద్ధ, తీరిక లేవన్న సంగతి తెలుస్తుంది. శతాబ్దం కిందట లేదా అంతకు చాలాముందు నుంచీ ప్రధాన నగరాలుగా వున్నవాటిపై ఎటూ శ్రద్ధ లేదు. కనీసం కొత్తగా నిర్మిస్తున్న నగరాలపైన అయినా ముందుచూపుతో వ్యవహరిద్దామన్న జ్ఞానం లేదు. నిరుడు ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 9 వరకూ దశాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా కుండపోత వర్షాలు విజయవాడ నగరంలో కొంత భాగాన్ని ముంచెత్తడంతోపాటు అమరావతిని కూడా వరదలు అస్తవ్యస్తం చేశాయి. దాని పరిధిలోని 29 గ్రామాల్లో 25 నిండా నీళ్లల్లో మునిగాయి. సాక్షాత్తూ సీఎం చంద్రబాబే అక్రమంగా వుంటున్న తన కరకట్ట నివాసాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ తదితర సంస్థలు మూతపడాల్సి వచ్చింది. లక్షలాదిమంది ప్రజలు సకాలంలో సాయం అందక ఇబ్బందులు పడ్డారు. విజయవాడలో 35 మంది మరణించారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ చెప్పినా మొండి వైఖరితో అమరావతికి పూనుకోవటమే తప్పనుకుంటే ఇటీవల



ప్రధాని నరేంద్ర మోదీని మళ్లీ పిలిచి అట్టహాసంగా సభ చేసి పనులు మొదలుపెట్టారు. అమరావతి ప్రాంత నేల స్వభావం తెలియకపోతే పోయింది... కనీసం కేంద్రీకృత నగరాల వల్ల కలిగే ముప్పును చూస్తూ కూడా వేలకోట్లు కుమ్మరిస్తున్నారంటే ఏమనుకోవాలి? 'ప్రకృతి వైపరీత్యాలు నిజమైన అర్థంలో ప్రకృతి కల్పిస్తున్న వైపరీత్యాలు కాదు. అవి మనిషి రూపొందించే విధానాల వైఫల్యం' అంటాడు అమెరికన్ దౌత్య నిపుణుడు జాన్ బోల్టన్. కుంభవృష్టి కురిసినా దాన్నంతటినీ ఇముడ్చుకోగల చెరువులూ, వాగులూ, వంకలూ దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ వున్నాయి. వాటిల్లో కొన్ని సహజసిద్ధమైనవీ, కొన్ని మన పూర్వీకులు ఎంతో ముందు చూపుతో నిర్మించినవీ. కానీ చేజేతులా మనమే వాటి పీకనొక్కుతున్నాం. ఇష్టానుసారం ఆక్రమించి అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నా కళ్లుమూసుకుంటున్నాం. హైదరాబాద్‌లోని కంచె గచ్చిబౌలి భూముల్లో బుల్‌డోజర్లు దింపి ప్రకృతి సంపద నాశనం చేస్తున్నారని ఆవేదన చెందిన ప్రధానే, ఆ తర్వాత కొద్దిరోజులకే వేలాది ఎకరాల పంట భూముల్ని మాయం చేసే అమరావతికి రెండోసారి శంకుస్థాపన చేశారు. తమ కూటమి ప్రభుత్వమైతే ఒక లెక్క.. వేరే పార్టీ ప్రభుత్వమైతే ఒక లెక్క! నిర్దిష్టమైన విధానాల్లేకుండా 'ఏ రోటి కాడ ఆ పాట'న్నట్టు ప్రవర్తించే పాలకుల వల్లే వైపరీత్యాలు ముంచుకొస్తున్నాయి. వీటిని నివారించటం మానవ మాత్రులకు సాధ్యం కాకపోవచ్చు. కానీ కాస్త తెలివితో వ్యవహరిస్తే వాటివల్ల కలిగే నష్టాలను కనిష్ఠ స్థాయికి తీసుకురావొచ్చు. కారణాలేమైనా వాతావరణం గతంలో మాదిరి లేదు. మన విధ్వంసకర ఆచరణతో దాన్ని మరింత క్షీణింపజేస్తున్నాం. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణగానీ, వికేంద్రీకరణగానీ లేకపోవటంతో నగరాలు కిటకిటలాడుతున్నాయి. నగరాల్లోనే ఉపాధి అవకాశాలుండటంతో గ్రామీణ ప్రాంత ప్రజలు అక్కడికే క్యూ కడుతున్నారు. పెరిగిన జనాభాకు తగినట్టు డ్రయినేజీ వ్యవస్థ లేకపోవటంతో చిన్నపాటి వర్షానికే నగరాలు నరకాలుగా మారుతున్నాయి. ఈసారి వర్షరుతువు ఎలా వుండబోతున్నదో ముంబై నగరాన్ని ముంచెత్తిన వాన నిరూపించింది. సహాయ సిబ్బందిని అందుబాటులో వుంచటంతో సహా పలు ముందస్తు చర్యలు తీసుకోవటం మినహా ఈ ఏడాది ఎటూ ఇప్పటికిప్పుడు చేసేదేమీ లేదు. కనీసం రాబోయేకాలంలోనైనా అమల్లోవున్న విధానాలను సమీక్షించుకుని మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ప్రణాళికాబద్ధమైన పథకాలు రూపొందించి అమలుచేసి, వికేంద్రీకరణపై దృష్టిసారిస్తే చాలావరకూ సమస్యలు పరిష్కారమవుతాయి.

## కథకు దక్కిన గౌరవం

కన్నడ రచయిత్రి బాను ముష్తాక్ తన 'హార్ట్ ల్యాంప్'(హృదయ దీపం) కథాసంపుటికిగానూ 'ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్' గెలుచుకోవడం చాలా విధాలుగా ప్రత్యేకమైనది. ఇది కర్ణాటకకే కాదు, దక్షిణ భారతదేశానికే దక్కిన తొలి గౌరవం. బుకర్ చరిత్రలో ఒక కథల సంపుటికి ఈ పురస్కారం దక్కడం ఇదే ప్రథమం. ఇది గెలుచుకున్న అత్యంత ఎక్కువ వయసువాళ్లలో(77) ఆమె ఒకరు (ఫిలిప్ రాత్‌కు ఇచ్చినప్పుడు 78 ఏళ్ళు). ఆంగ్లంలో రాసిన పుస్తకాలకు ఇచ్చే 'బుకర్ ప్రైజ్'ను కొంతమంది భారతీయ, భారత సంతతి రచయితలు ఇంతకుముందు గెలుచుకున్నారుబీ వాటి గొప్పతనం వాటిదే! కానీ ఆంగ్లంలో రాయనక్కర్లేకుండా తమకు చేరువైన భాషలో రాస్తూనే అంతర్జాతీయ ఖ్యాతి పొందవచ్చని ఈ గౌరవం చెబుతోంది. భిన్న భారతీయ భాషల్లో వస్తున్న శ్రేష్ఠమైన సాహిత్యాన్ని ఆంగ్ల ప్రపంచపు గుమ్మంలోకి ప్రవేశపెట్టే చొరవ చూపేలా ఈ విజయం ప్రచురణకర్తలకు ప్రేరణనిస్తోంది. గట్టిగా ఆంగ్ల భాష తలుపు కొట్టగలిగితే, ఇతర భాషల కిటికీలు వాటికవే తెరుచుకుంటాయి. రచయిత్రి, పాత్రికేయురాలు, సామాజిక కార్యకర్త, న్యాయవాది అయిన బాను ముష్తాక్ ఆరు కథా సంపుటాలు, ఒక వ్యాసాల సంకలనం, ఒక కవిత్వ సంపుటి, ఒక నవల వెలువరించారు. పురుషాధిపత్య సమాజంలో ముస్లిం మహిళల జీవన వ్యథలను ఆమె చిత్రించారు. ఆమె పాత్రలు కన్నడ, దక్కనీ ఉర్దూ, అరబిక్ మాట్లాడుతాయి. 1990%-%2023 మధ్యకాలంలో ఆమె రాసిన 50కి పైగా కథల్లోంచి 12 కథలను కూర్చడంతోపాటు, వాటిని ఆంగ్లంలోకి అనువదించిన దీపా భాస్తి ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ గెలుచుకున్న తొలి భారతీయ అనువాదకురాలు అయ్యారు. "మహిళ రాసి, మహిళ సంపాదకత్వం వహించి, మహిళ అనువదించిన పుస్తకం హార్ట్ ల్యాంప్" అన్నారు బెంగాలీ అనువాదకుడు అరుణవ సిన్హా. ఈ పురస్కారాన్ని 2022లో తొలిసారిగా ఇండియా నుండి హిందీ రచయిత్రి గీతాంజలిశ్రీ గెలుచుకోవడానికి కారణమైన అనువాదకురాలు డైసీ రాక్‌వెల్ ఒక అమెరికన్ అని తెలిసిందే! అవార్డు కింద నగదుగా ఇచ్చే యాభై వేల పౌండ్లను నియమాల మేరకు బాను, దీపా సమానంగా పంచుకుంటారు. భారతీయ భాషల్లోని మంచి సాహిత్యాన్ని మరో దరికి చేర్చాలన్న అనువాదకుల పూనికకు ఇది గట్టి ప్రోత్సాహం కాగలదు. 1970%-%80ల్లో కర్ణాటకలో మొదలైన బండాయ సాహిత్యోద్యమం దళితులు, ముస్లింలు తమ కథలను తామే రాసుకునే ప్రేరణనిచ్చింది. మంచి ముస్లిం బాలికలు ఉర్దూలో ఖురాన్ చదవగలిగితే చాలు అనే సామాజిక వాతావరణంలో తొలుత ఉర్దూలో చదవడం ప్రారంభించి, తండ్రి (ఎస్.ఎ.రహమాన్, హెల్త్ ఇన్‌స్పెక్టర్) ప్రోద్బలంతో కన్నడ మాధ్యమంలోకి మారిన బాను ఆ భాషనే తన రచనా వాహికగా ఎంచుకున్నారు. "నాకు అక్షరాలు వచ్చినప్పటి




నుంచీ రాయడం మొదలుపెట్టాను" అంటారామె. రష్యన్ రచయిత ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ, కన్నడ రచయిత దేవనూర్ మహదేవను అభిమానించే ఆమె 'నాను అపరాధియే?' పేరుతో తొలి కథ రాశారు. తన స్నేహితురాళ్లు చిన్ననాటనే పెళ్లిళ్లు చేసుకుని జీవితంలో నిలిచిపోతున్నా ఆమె ఆగకుండా పైచదువులకు వెళ్లారు. సినిమాకు వెళ్లడం మీద ఒక ముస్లిం యువతిని అడ్డుకున్న ఉదంతం గురించి ఆమె రాసిన తొలి వ్యాసం చర్చనీయాంశం కావడంతో పాటు ఆమెను 'లంకేశ్ పత్రికే' జర్నలిస్టుగా మార్చింది. 26 ఏళ్ల వయసులో ప్రేమ వివాహం చేసుకున్నప్పటికీ, వివాహానంతరం బురఖా ధరించాలనీ, ఇంటి పనులకే పరిమితం కావాలనీ అత్తవారింటి నుంచి ఒత్తిడి వచ్చింది. చేస్తున్న హైస్కూల్ టీచర్ ఉద్యోగం మానాల్సి వచ్చింది. ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి కలిగాక ఒక దశలో నిరాశా నిస్పృహలతో వైట్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకోబోయారు. మూడేళ్ల పాపను ఆమె కాళ్ల దగ్గర పెట్టి, అలా చేయొద్దంటూ ఆమె భర్త ముష్తాక్ మొహియుద్దీన్ ఆమెను హత్తుకున్నారు. అప్పట్నించీ ఆమెకు అన్నింటా అండగా నిలిచారు. స్త్రీల వేదన, నిస్సహాయత తన మీద లోతైన ప్రభావం చూపి, రాయక తప్పని స్థితిని కల్పించాయంటారు బాను. "నువ్వు ఈ ప్రపంచాన్ని మళ్లీ నిర్మించదలిస్తే, మగవాళ్లనూ ఆడవాళ్లనూ సృష్టించదలిస్తే అనుభవం లేని కుమ్మరిగా ఉండకు. ప్రభూ! ఈ భూమ్మీదకు ఒక్కసారి ఆడదానిగా రా!" అని అడుగుతుంది 'ఓ దేవుడా! ఒక్కసారి ఆడదానిగా ఉండు' కథ. "మతం, సమాజం, రాజకీయాలు స్త్రీల నుంచి ప్రశ్నించకూడని విధేయతను డిమాండ్ చేస్తాయి. ఈ క్రమంలో అమానవీయ క్రూరత్వాన్ని మోపుతాయి" అంటారామె. మసీదుల్లో స్త్రీలకు ప్రార్థించే హక్కు ఉండాలంటారు ఈ 'ఫైర్‌బ్రాండ్'. సొంత సమాజం మీద ఉమ్మివేయడం ద్వారా బయట జేజేలు కొట్టించుకుంటోందన్న నిందలు మోశారు. ఒక దశలో ఆమె మీద కత్తిదాడి యత్నం జరిగింది. అయితే దాడి చేసిన వ్యక్తిని ఆమె క్షమించారు. మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలిగా రెండుసార్లు ఎన్నికయ్యారు. 'మన ముక్కులు కోపిస్తుంది' అని ఆమె తండ్రితో ఆమె కుటుంబ సభ్యులు సరదాగా అనేవాళ్లట. బదులుగా ఇప్పుడు అందరిలోనూ వాళ్లంతా ముఖాలు ఎత్తి నిలబడేలా చేయగలిగారు. ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవడాన్ని 'ఒక్క ఆకాశాన్ని వెయ్యి మిణుగురులు వెలిగించినట్టుగా' ఆమె అనుభూతి చెందారు. 'ప్రతీ గొంతుకనూ వినే, ప్రతీ కథకూ మన్నన దక్కే, ప్రతీ మనిషీ మరొకరికి చెందే ప్రపంచాన్ని సృష్టించాలి' అని తన పురస్కార అంగీకారోపన్యాసంలో కోరారు.

## సుప్రీంకోర్టు రాష్ట్రపతికి గడువు విధించగలదా.. రాజ్యాంగ నిబంధనలు ఏమి చెబుతున్నాయి?

దేశ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల రాష్ట్రపతి, గవర్నర్లకు రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులపై నిర్ణయం తీసుకో వడానికి నిర్దిష్ట గడువు విధించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, రాజ్యాంగంలో స్పష్టమైన నిబంధనలు లేనప్పుడు కోర్టు ఈ ఆదేశాలు ఎలా జారీ చేసిందని ప్రశ్నించారు. రాష్ట్రపతి వ్యాఖ్యలు ఈ వ్యవహారంలోని రాజ్యాంగపరమైన చిక్కులను మరింతగా వెలుగులోకి తెచ్చాయి.

చరిత్రలో నిలిచిపోయేట్టుగా మహానాడు వేడుకలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లు గవర్నర్ ముందుకు వచ్చినప్పుడు, ఆయన దానిని ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు లేదా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపవచ్చు. అయితే, గత కొంతకాలంగా పలు రాష్ట్రాల్లో గవర్నర్లు కొన్ని బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపిన తర్వాత, ఆ బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో గణ నీయమైన జాప్యం చోటు చేసుకుంటోంది. దీనివల్ల సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పరిపాలనా పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అభివృద్ధి పనులు నిలిచిపోవడం, కొత్త చట్టాల అమలు ఆలస్యం కావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో, పలు రాష్ట్ర ప్రభుత్వాలు తమ శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు రాష్ట్రపతి పరిశీలనకు పంపడం, ఆ బిల్లులపై నిర్ణయం తీసుకోవడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.

ఐఏఎస్ అధికారులు అనుచిత ప్రవర్తన మార్చుకోవాలి!

సుప్రీం స్పష్టతతో.. రాష్ట్రాలకు ఊరట!

ఈ వ్యవహారాన్ని పరిశీలించిన సుప్రీంకోర్టు, సంబంధిత రాష్ట్రాల వాదనలను విన్న అనంతరం, ఈ సమస్యపై స్పష్టమైన మార్గదర్శకాన్ని రూపొందించాలని నిర్ణయించింది. ఈ తీర్పులో ప్రధానంగా రాజ్యాంగంలోని రెండు ముఖ్యమైన అధికరణలు చర్చకు వచ్చాయి. మొదటిది ఆర్టికల్ 200, ఇది రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లు విషయంలో గవర్నర్‌కు ఉన్న అధికారాలను వివరిస్తుంది. గవర్నర్ బిల్లును ఆమోదించే అధికారం, తిరస్కరించే అధికారం లేదా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపే అధికారం కలిగి ఉంటారు. రెండవది ఆర్టికల్ 201, ఇది రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లును గవర్నర్ పంపినప్పుడు, రాష్ట్రపతి ఆ బిల్లును ఆమోదించవచ్చు లేదా తిరస్కరించవచ్చునని తెలుపుతుంది. ఈ రెండు అధికరణలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, సుప్రీంకోర్టు తన తీర్పులో గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించింది. అంతే కాకుండా, ఒకవేళ నిర్ణయం తీసుకోవడంలో



జాప్యం చోటు చేసుకుంటే, అందుకు తగిన కారణాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయాలని కూడా పేర్కొంది. ఈ తీర్పు రాష్ట్ర ప్రభుత్వాలకు కొంత ఊరటనిచ్చింది. పైగా ఇది రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలను పరిరక్షించడంలో సహాయపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ తీర్పు ప్రకారం, రాష్ట్రపతి బిల్లును తప్పనిసరిగా ఆమోదించాలి లేదా తిరస్కరించాలి, లేదా కొన్ని నిర్దిష్ట సవరణలతో తిరిగి పంపాలి. నిర్ణయం తీసుకోవడంలో అనవసరమైన జాప్యం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు స్పష్టం చేసింది.

తొలి సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రం

రాజ్యాంగబద్ధ పదవులను గౌరవించాలి!

అయితే, సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పటి నుండి కొన్ని భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు న్యాయ నిపుణులు, రాజకీయ విశ్లేషకులు ఈ తీర్పును సమర్థిస్తూ, ఇది రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పరిరక్షిస్తుందని, గవర్నర్, రాష్ట్రపతి కార్యాలయాల అధికారాలను మరింత క్రమబద్ధీకరిస్తుందని వాదిస్తున్నారు. మరోవైపు, మరికొందరు ఈ తీర్పును విమర్శిస్తూ, ఇది రాష్ట్రపతి అధికారాలలో అధికంగా జోక్యం చేసుకుంటుందని అభిప్రాయపడుతున్నారు. ఉపరాష్ట్రపతి వంటి ఉన్నత స్థాయి వ్యక్తులు కూడా బహిరంగంగానే ఈ తీర్పును విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాల శాసనాధికారాలను పరిరక్షించడం ఎంత ముఖ్యమో, రాష్ట్రపతి, గవర్నర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడటం కూడా అంతే ముఖ్యమని వారు వాదిస్తున్నారు. రాష్ట్రపతి తన విచక్షణాధికారాన్ని రాజ్యాంగ పరిధిలో వినియోగించాలని, న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగా రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని వారు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా భారత న్యాయవ్యవస్థ పాత్రపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది.

కార్యకర్తా.. కదలి రా!

అత్యున్నత వ్యవస్థ ఇదే!

భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వై.వి. చంద్రచూడ్ ఒక సందర్భంలో మాట్లాడుతూ, "న్యాయ వ్యవస్థ చట్టాలను పరిరక్షించేది" అని పేర్కొన్నారు. ఇది న్యాయ వ్యవస్థ ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. న్యాయ వ్యవస్థ లేకపోతే, చట్టాలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది. పౌరుల హక్కులు ఉల్లంఘించబడవచ్చు. న్యాయవ్యవస్థ ఈ సమస్యలను నివారిస్తుంది. అంతేకాకుండా, న్యాయ వ్యవస్థ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని పరిరక్షిస్తుంది. ఒకప్పుడు పార్లమెంటే అత్యున్నతమైనదని వాదించబడింది, అంటే పార్లమెంటు చేసిన చట్టాలే దేశంలో అత్యున్నతమైనవని కొందరు భావించారు. అయితే, సుప్రీంకోర్టు అనేక సందర్భాల్లో రాజ్యాంగమే అత్యున్నతమైనదని, న్యాయవ్యవస్థ రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని స్పష్టం చేసింది. న్యాయ వ్యవస్థ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని కాపాడుతుందని కూడా పేర్కొంది, అంటే రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలను మార్చే చట్టాలను న్యాయ వ్యవస్థ కొట్టివేస్తుంది. ఇది న్యాయ వ్యవస్థ ముఖ్యమైన బాధ్యత.

రాష్ట్రపతికి గడువు లేదు..

మరోవైపు న్యాయవ్యవస్థ తన పరిధిని దాటి కార్యనిర్వాహక శాఖ అధికారాల్లో జోక్యం చేసుకుంటోందని విమర్శకులు పేర్కొంటున్నారు. రాజ్యాంగం రాష్ట్రపతికి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో బిల్లులను ఆమోదించకుండా నిలిపివేసే అధికారాన్ని ఇస్తుంది. అయితే, ఈ తీర్పు ఆ అధికారాన్ని తగ్గిస్తుందనే వాదనలు ఉన్నాయి. రాష్ట్రపతికి గడువు విధించడం ద్వారా, రాజ్యాంగం ప్రసాదించిన విచక్షణాధికారాన్ని పరిమితం చేస్తుందని కొందరు భావిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో, రాష్ట్రాలు ఆమోదించిన బిల్లులు కేంద్ర ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా ఉండవచ్చు. రాజ్యాంగంలో రాష్ట్రపతికి బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి స్పష్టమైన గడువు లేనందున, కోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకోవడం ఎంతవరకు సమంజ సమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఈ తీర్పు అమలును బట్టి..

సుప్రీంకోర్టు ఈ మూడు నెలల గడువును ఏ ప్రాతిపదికన నిర్ణయించిందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఇది రాష్ట్రాల వాదనలు, పాలనా సౌలభ్యం, లేదా ఇతర న్యాయ సూత్రాల ఆధారంగా తీసుకున్న నిర్ణయమా అనేది తెలియాల్సి ఉంది. రాజ్యాంగంలో అధికారాల విభజన స్పష్టంగా ఉన్నప్పటికీ, కొన్నిసార్లు ఈ పరిధుల మధ్య స్పష్టత లోపిస్తుంది. న్యాయ వ్యవస్థ రాజ్యాంగ పరిరక్షకురాలిగా తన బాధ్యతను నిర్వర్తిస్తున్నప్పటికీ, కార్యనిర్వాహక అధికారాల్లోకి అతిగా జోక్యం చేసుకుంటోందనే విమర్శలు కూడా ఉన్నాయి. భవిష్యత్తులో ఈ అంశంపై మరింత లోతైన చర్చలు జరిగే అవకాశం ఉంది. సుప్రీంకోర్టు తీర్పు అమలు దాని పర్యవసానాలను బట్టి రాజ్యాంగ సవరణ అవసరమా లేదా అనే దానిపై ఒక నిర్ణయానికి

## అచ్చ సుదర్శన్ కు సర్దార్ పటేల్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డ్




పరకాల/నడికూడ (**కదిలించే వార్త) మే 27:** హనుమకొండ జిల్లా నడికుడ మండలం చర్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న అచ్చ సుదర్శన్ కు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు వరించడం జరిగినది. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని గుజరాత్ రాష్ట్రంలోని ఉంజా పట్టణంలో ఈ అవార్డు కార్యక్రమం జూన్ 5వ తారీఖున జరుగుతుందని ఆరోజు అందజేయడం జరుగుతుందని ఆ సంస్థ అధ్యక్షుడు శైలేష్ కుమార్ తెలియజేశారు. ఈ అవార్డుకు భారతదేశంలోని 13 రాష్ట్రాలలో పనిచేస్తున్న ఇన్నోవేటివ్ టీచర్స్ ను తెలుసుకొని తెలంగాణ నుండి అచ్చ సుదర్శన్ ను ఎంపిక చేయడం జరిగినదని అన్నారు. అచ్చ సుదర్శన్ పాఠశాలలో వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తూ, విద్యార్థులను తీర్చి దిద్దుతున్న క్రమాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకొని ఈ అవార్డుకు అచ్చ సుదర్శన్ ను ఎంపిక చేశారని అన్నారు.

## గుడిసెలో ఉంటున్నాం ఇందిరమ్మ భరోసా కల్పిస్తే ఇళ్లు నిర్మించుకుంటాం

### అధికారులను వేడుకుంటున్న అర్షం నాగమల్లు



ఆత్మకూర్ / (**కదిలించే వార్త) మే 27:**/పూరి గుడిసెలో ఉంటున్నామన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఆర్థిక సహాయం చేస్తే ఇల్లు నిర్మించుకుంటామని అర్షం నాగమల్లు అధికారులను వేడుకుంటున్నారు. ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామానికి చెందిన అర్షం నాగమల్లు తనకు గుంట భూమి కూడా లేదని రోజు కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నానని ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ళు పథకానికి నేను పూర్తి అర్హుడనని అధికారులు నా యొక్క ఇళ్ళు ను పర్యవేక్షించి నాకు రెండవ విడత లోనైనా ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని వేడుకుంటున్నానని తెలిపారు.

## శ్రీనివాసపురం యువత కోసం బీజేపీ, తెలుగుదేశం, జనసేన నాయకుల సహకారంతో తాత్కాలిక గ్రౌండ్



వరదయ్యపాలెం(**కదిలించే వార్త) మే 27:** వరదయ్యపాలెం మండలానికి చెందిన సి ఎల్ ఎం పల్లి పంచాయితీ మిట్ట హరిజనవాడ శ్రీనివాసపురం గ్రామ యువతకు మంచి గ్రీన్ ఫీల్డ్ గ్రౌండ్ కల్పించాలనే ఆశయం తాత్కాలికంగా నెరవేరింది. క్రీడలతో తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలనుకుంటున్న గ్రామ యువత విన్నపం మేరకు వరదయ్యపాలెం బిజెపి మండల అధ్యక్షులు దిలీప్ రాయల్,జనసేన పార్టీ%ఎ%నాయకుడు శ్రీధర్, సంయుక్తంగా ముందుకు వచ్చి ఈ కార్యక్రమానికి నాంది పలికారు.గ్రామ యువత తరపున వారు చేసిన వినతిని స్పందించి తాత్కాలిక గ్రౌండ్ తెలుగుదేశం నాయకులు అభిరామ్ చౌదరి తాత్కాల్కంగా స్థలాన్ని ఇచ్చినందుకు గ్రామ యువత చాలా సంతోషం వ్యక్తం చేశారు, అనంతరం స్వంత ఖర్చుతో జెసిబి ద్వారా స్థలాన్ని చదును చేయించి, ఒక సరైన క్రీడా మైదానంగా మార్చారు. యువత కోసం ఇలాంటి వసతులు అవసరమని భావించి, రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా చేసిన ఈ సేవను గ్రామ ప్రజలు ప్రశంసలతో అభినందిస్తున్నారు.ఈ కార్యక్రమం సందర్భంగా గ్రామ యువత, నాయకులను ఘనంగా సన్మానించారు. “గ్రామంలో ఎప్పటి నుంచో క్రీడల కోసం ఒక స్థిరమైన మైదానం కావాలని కోరుకుంటూ వచ్చాము. ఇప్పుడది తాత్కాలికంగా నెరవేరింది.మా తరపున,మా భవిష్యత్తు తరాల తరఫున కూడా మేము కోరుకునేది మండలంలో క్రీడా మైదానం ఉంటే యువత బావు తరాల కోసం చెడు వ్యసనాలకు బానిసవ్వకుండా ఉంటారని అని గ్రామ యువనేతలు తెలిపారు.ఈ సందర్భంగా వరదయ్యపాలెం బిజెపి మండల అధ్యక్షులు దిలీప్ రాయల్ మాట్లాడుతూ, “యువతే రాబోయే భారతదేశ భవిష్యత్తు. వారికి సరైన వాతావరణం కల్పించడమే నేటి బాధ్యత. రాజకీయానికి అతీతంగా, గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి”అని అన్నారు.అలాగే జనసేన నాయకుడు శ్రీధర్ మాట్లాడుతూ, “ఇది ప్రారంభం మాత్రమే. గ్రామంలోని మిగతా అవసరాలు కూడా గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తాము.యువతకు మద్దతుగా ఎప్పుడూ నిలుస్తాము” అని స్పష్టం చేశారు.గ్రామ ప్రజలు, పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.గ్రామ అభివృద్ధిలో రాజకీయ నాయకులు ఇలా చొరవ చూపడాన్ని స్థానికులు ఎంతో ఆదరిస్తున్నారు.

## అధ్యాయం ఉత్సవానికి సర్వం సిద్ధం



నల్లబెల్లి (**కదిలించే వార్త) మే 27:** నల్లబెల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం రెండవ వార్షికోత్సవం (అధ్యాయనోత్సవం) సందర్భంగా ప్రత్యేక అలంకరణతో ఈ కోవెల రూపుదిద్దుతుంది. జూన్ 01తేదీ ఆదివారం వార్షికోత్సవం సందర్భంగా ధ్వజారోహణము. తోరణ బంధము. పుణ్యాహవాచనము. దేవాలయంలో కొలువుదీరిన దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించడంతోపాటు గణపతి సహిత సకల దేవత అవగాహన హెూమము. నవగ్రహ హెూమము విశ్వశాంతి హెూమము రుద్రాభిషేకము లాంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు. దేవాలయ శాశ్వత ధర్మకర్తలు తాటిపల్లి రవీందర్. దేవాలయ కమిటీ అధ్యక్షులు గండె శ్రీనివాస్ తోపాటు సభ్యులు పేర్కొన్నారు. ఈ ద్వితీయ వార్షికోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పార్వతీ సహిత రాజరాజేశ్వర స్వామి కృపకు పాత్రులు కాగలరని వారు భక్తులను కోరారు.

## చట్టం ఎవరికి చుట్టం

### పుస్తక ఆవిష్కరణ చేసిన వక్ఫ్ పరిరక్షణ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ రఫీ..



కడప (**కదిలించే వార్త) మే 27:** వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం? అనే పుస్తకాన్ని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ముద్రించిన పుస్తకాన్ని.వక్ఫ్ పరిరక్షణ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహమ్మద్ రఫీ చేతుల మీదుగా కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లింల ఐక్యతను దెబ్బతీయడం కోసం అయోధ్య సమస్య తీసుకురావటం 370 రద్దు చేయటం త్రిబుల్ తలాక్ అంశాన్ని తీసుకురావటం హిజాబ్ అంశాన్ని తీసుకురావటం వెనుకల ఒక మతత రాజకీయ పార్టీ చేస్తున్న కుట్టే తప్ప వేరేది ఏమీ లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకని వక్ఫ్ చట్టం ఎవరికి చుట్టం?పుస్తకాన్ని అత్యధికంగా ప్రజల్లోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని ఈ పుస్తకం వల్ల అన్ని వర్గాల ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని ఆయన అన్నారు.ఈ సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర నాయకులు ఇషాక్ అలీ. మత గురువు అక్బర్ అలీ రసాది, వక్ఫ్ బోర్డు పరిరక్షణ కమిటీ కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్ నగర కన్వీనర్ మౌలానా జాకీర్ హుస్సేన్ కో కన్వీనర్స్ షేక్ మక్బూల్ బాషా బహుద్దీన్ హిధాయతుల్లా షబ్బీర్, ఆబిద్ హుస్సేన్ అబ్దుల్ సత్తార్, జాబీర్ అలీ ఖాన్, జిలాని జమాయితో ఇస్లామిక్ హింద్ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా నాయకులు షాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## జన్ను వంశ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఎన్నికకు కార్పొరేటర్ జన్ను శీభారాణి అనిల్ కుమార్ లకు ఆహ్వానం



వరంగల్ (**కదిలించే వార్త) మే 27:** గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ పైడిపల్లి లోని జన్ను వంశ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీ ఏర్పాటు కోసం స్థానిక కార్పొరేటర్ జన్ను శీభారాణి అనిల్ కుమార్ లకు ఆహ్వానం పలికిన జన్ను వంశ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జన్ను యిర్మీయా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. జూన్ ఒకటో తేదీ ఆదివారం రోజున పైడిపల్లి లోని జెడ్ పిఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశమునకు ముఖ్య అతిథులుగా మూడో డివిజన్ కార్పొరేటర్ జన్ను శీభారాణి అనిల్ కుమార్ లను ఆహ్వానిస్తూ ఇన్విటేషన్ ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో జన్ను వంశ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ జన్ను యిర్మీయా, జనరల్ సెక్రెటరీ. రెవ.డాక్టర్ జన్ను ప్రభాకర్, కన్వీనర్ జన్ను సొలోమోన్, ఫండ్ రైసింగ్ కమిటీ చైర్మన్ రెవ.జన్ను ఏసు పాదం, ఉపాధ్యక్షుడు జన్ను సొలోమోన్, తదితరులు పాల్గొన్నారు.

## తాగు నీరు అందలేదని సిపిఐ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు రాస్తారోకో....



వరదయ్యపాలెం (**కదిలించే వార్త) మే 27:**తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండల కేంద్రంలో 20 రోజులుగా పంచాయతీ వారి సరఫరా చేసే తాగునీరు అందలేదని గ్రామ ప్రజలు సిపిఐ ఆధ్వర్యంలో వరదయ్యపాలెం బస్టాండ్ వద్ద రాస్తారోకో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ.శ్రీ సిటీ కి గ్యాస్ మరియు నీరు సరఫరా చేసేందుకు రోడ్డుకు ఇరువైపులా పైప్ లైన్ నిర్మాణం జరుగుతున్న సందర్భంగా పంచాయతీ నీటి పైపులు తెగిపోవడం వల్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అనేకసార్లు పంచాయతీ సెక్రెటరీ విన్నవించిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలు పడుతున్న అవస్థలు పట్టించుకోలేదని వారు ఆరోపించారు.గుంతలు తీసేసి కాంట్రాక్టర్లు పని ఆపేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అడిగితే మీ పంచాయతీ సెక్రెటరీ తో మాట్లాడకుండానే సమాధానం చెబుతున్నారు వరదయ్యపాలెం పంచాయతీ కార్యదర్శి కాంట్రాక్టర్స్ గుత్తేదారు తో కొమ్మక్కై ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని పై అధికారులు వెంటనే జోక్యం చేసుకొని ఈ సమస్యను పరిష్కారం చేయాలని ప్రజలు కోరారు.ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గం కార్యదర్శి ఆంభాకం చిన్ని రాజ్ మాట్లాడుతూ ఏజీ పి. ప్రతం అనే పేరుతో ఉన్న కంపెనీ ఈ కాంట్రాక్టర్ ని దక్కించుకొని పనులు చేస్తున్నదని జనావాసాల మధ్య పని చేసేటప్పుడు యుద్ధ ప్రాతిపదిక మీద చేయాల్సి ఉందని అయితే వరదయ్యపాలెం మండలంలో ఉన్న అధికార యంత్రాంగం మొత్తాన్ని లోబర్చుకుని పనులు జాపిం చేయడం వల్ల నీటి సమస్య. ట్రాఫిక్ సమస్య ఏర్పడిందని ఈ సమస్యను పరిష్కరించడంలో అధికార యంత్రాంగం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం వహిస్తా ఉందని ఆయన ఆరోపించారు రోజుల తరబడి నీరు అందుబాటులో లేకుండా పిల్లలు పెద్దలు స్కూళ్లకు ఉద్యోగాలకు వెళ్ళవలసిన వారు తీవ్రమైన ఇబ్బందులు పడుతూ ఉంటే ఎన్నిసార్లు పంచాయతీ కార్యదర్శులు తీసుకెళ్లిన పట్టించుకున్న పాపాన పోలేదని ఈ విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు మండల కేంద్రంలో రోడ్డుకి ఇరువైపులున షాపులు వెల్డింగ్ షాపులు కిరాణా కుట్లు 20 రోజులుగా నడుపుకోలేక తినే తిండిలో కూడా దుమ్ము ధూళి చేరి ఈ ప్రాంతంలో నివాసాలు ఉండలేని పరిస్థితి ఏర్పడిన అధికార యంత్రాంగం ఏమాత్రం స్పందించకుండా ఉందంటే కాంట్రాక్ట్ దారుడుతో ఏ మేరకు లాలుచిబడ్డారో అర్థం అవుతుంది ప్రజల యొక్క కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారులు ప్రజల సమస్యలు పట్టించుకోకపోవడం చాలా దుర్మార్గం చర్యని ఆయన ఖండించారు వెంటనే ప్రజలకు నీరు అందేటట్టు చూడాలని చిన్ని రాజ్ ఆయన డిమాండ్ చేశారు అలాగే ప్రజల పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్న వరదయ్యపాలెం మండల ప్రభుత్వ యంత్రాంగంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.రాస్తారోకో చేస్తున్న ప్రజల వద్దకు పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి పోలీసు యంత్రాంగం వచ్చి త్వరితగతిన నీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు.చంద్ర,ముల్లంగి శ్రీను, సైదు బాబు. సిద్ధిక్ బాషా.బుర్ర సుధాకర్ శెట్టి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కేంద్ర, ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై, రైతాంగ పోరాటాలను ఉధృతంగా చేస్తాం

### అఖిలభారత కిసాన్ ఫెడరేషన్ (ఎఐకెఎఫ్) జాతీయ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి






వరంగల్ (**కదిలించే వార్త) మే 27:**ఎంసిపిఐ రాష్ట్ర ప్రథమ మహాసభలు 26,27, 28 తేదీలలో పోగుల ఆగయ్య నగర్ (సాయి కన్వెన్షన్ హాల్ శివనగర్) లో జరుగుతున్న సందర్భంగా రెండవ రోజు మంగళవారం రైతు ర్యాలీ భారీ ప్రదర్శనను జాతీయ ఉపాధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి పోచమ్మ మైదానంలో జెండా ఊపి ప్రారంభించారు అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రైతులకు ఇవ్వాల్సిన రుణమాఫీలను ఎత్తి వేసేకుట్ర చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క జై కిసాన్ అని అనుకుంటూనే దాదాపు దేశంలో ఏడు లక్షల పైగా రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వం కారణమైందని ధ్వజమెత్తారు రైతు లేనిదే రాజ్యం లేదని, రైతే రాజు అని పెద్దపెద్ద ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు రైతుల చావుల మీద రాజకీయాలను చేయడం తప్ప వారి కుటుంబాలకు ఎలాంటి అండదండలు అందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఢిల్లీ నడి ఒడ్డున దేశ రైతులందరూ కేంద్ర ప్రభుత్వంపై 13 నెలలపాటు పోరాట నిర్వహిస్తే వాళ్ల చావులకు కారణమైన కేంద్ర ప్రభుత్వం కనీస నివాళులు అర్పించకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కార్పొరేట్ కంపెనీలకు తొత్తుగా పనిచేయడం కోసమే కుట్రలు చేస్తుందని తెలిపారు. ఇలాంటి విధానాలను అన్ని వర్గాల వారు పెద్ద ఎత్తున వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతులకు రైతుల పంటలకు రక్షణ కల్పించే విధంగా చట్టాలు చేయాల్సింది పోయి రైతులను విస్మరిస్తూ ముందుకు పోవడం బాధా కరమన్నారు. కోట్లాది రూపాయలు వివిధ అభివృద్ధి కార్యక్రమాల మీద ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రైతులకు ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఇవ్వాల్సిన రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయక పోవడం అదేవిధంగా ఎకరానికి 15000 పెట్టుబడి సహాయం అందించకపోవడం వృద్ధులకు పెన్షన్ పూర్తిస్థాయిలో అందించకపోవడం సిగ్గుచేటు అన్నారు. అనేక హామీలను గుప్పిచ్చి ఓట్లు వేసుకొని గద్దెనెక్కిన ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి అతి తక్కువ కాలంలో ప్రజా వ్యతిరేను మూట కట్టుకోవడం వలన పంచలు తడిసిన మూలంగా పంచాయతీ ఎన్నికలు జరపడానికి పంచలు తడుపుకుంటున్న ఈ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలనగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముద్ర వేసుకుంటుందని గత కెసిఆర్ విధానాలు వల్లనే రాష్ట్రం దివాలా తీసినది వాస్తవమైనప్పటికీ ఈ ప్రభుత్వం దాన్ని సరి చేయడం మరచి మాటలు మాట్లాడడం తప్ప ఆచరణలో విఫలం అవుతుందని తెలిపారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేసే రైతులకు ఇవ్వాల్సిన రుణమాఫీ పెట్టుబడి సాయం అందించాలని కోరారు ఈ రైతు ర్యాలీ ప్రదర్శనలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు రైతు నాయకులు చంద్రశేఖర్ సింగతి సాంబయ్య, పానుగంటి నరసయ్య బలుసుకూరీ నరసయ్య బాసిపాక రమేష్ కుశ సంపత్ వీరమల్లు రాజు మాదం తిరుపతి తాటికొండ రవి మాలోతు రాజేష్ నాయక్ రాకేష్ సూరి శేఖర్ తో పాటు దాదాపు 1000 మంది రైతులు పాల్గొన్నారు.

## పీహెచ్సీ వైద్య సిబ్బంది కొరతపై బీజేపీ మండల శాఖ ఆందోళన

### -డీఎంహెచ్ఓకు వినతిపత్రం సమర్పణ




దామెర (**కదిలించే వార్త) మే 27:** హనుమకొండ జిల్లా దామెర మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ గురుజాల శ్రీరామ్ రెడ్డి, బత్తుల సుమంత్ కలిసి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ( డిఎంహెచ్ ఓ) డాక్టర్ అప్పయ్య కు వినతిపత్రం సమర్పించారు. దామెర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)లో వైద్య సిబ్బంది కొరత వల్ల ప్రజలకు తగిన వైద్య సేవలు అందకపోవడం దుర దృష్టకరమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పీహెచ్సీలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సిబ్బంది డా. మంజుల-మండల వైద్యాధికారి, లీలపబ్లిక్ హెల్త్ నర్స్ (పి హెచ్ ఎన్)కరుణ రాణి-స్టాఫ్ నర్స్ శరత్ బాబుఫార్మాసిస్ట్ సుప్రజ -ఎల్డీ కంప్యూటర్ ఆపరేటర్, వెంకటేశ్వర్లు, ఎంపిహెచ్ డబ్ల్యు (పురుషులు)ఒక అటెండర్ 10 ఏఎన్ఎం ల పోస్టుల్లో కేవలం 5 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. అందులో 2 మంది డిప్యుటేషన్‌పై ఉన్నారు. మిగిలిన 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు అని ప్రజల నమ్మకం. కానీ ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు వెళ్లి అధిక ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఇది రైతులకు, కూలీ వర్గాలకు తీరని భారం. తక్షణమే సిబ్బంది నియామకం చేపట్టకపోతే, దీనిపై బీజేపీ తీవ్రంగా స్పందించాల్సి వస్తుందని ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం తీసుకునే అజాగ్రత్తకు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. ఇది కేవలం పార్టీ లేదా రాజకీయాల విషయం కాదు ఇది ప్రజల ప్రాణాలకు సంబంధించిన విషయమని ప్రభుత్వం గుర్తించాలి” అని హితవు పలికారు. ప్రభుత్వం ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు. డిఎం హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య సమస్యను సానుకూలంగా స్వీకరించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైన సిబ్బంది నియామకానికి తాము ప్రాధాన్యత ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

## మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ను పరామర్శించిన ఎంపీ రవిచంద్ర



వరంగల్ (**కదిలించే వార్త) మే 27:** రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ను పరామర్శించారు. ఆమె సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో మోకాలు శస్త్ర చికిత్స చేయించుకున్నట్లు తెలియడంతో ఎంపీ రవిచంద్ర మంగళవారం వెళ్లి పరామర్శించారు. ఎంపీ వద్దిరాజు మాజీ ఎంపీ సత్యవతి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని, త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు.

## గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న శాయంపేట పోలీసులు



శాయంపేట (**కదిలించే వార్త) మే 27:**హనుమకొండ జిల్లా శాయంపేట ఎస్ ఐ జె పరమేశ్వర్ తన సిబ్బందితో కలిసి మందారిపేట సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్కడే బస్టాండ్ వద్ద ఒక వ్యక్తి అనుమానస్పదంగా కనిపించగా వెంటనే అతని వద్దకు వెళ్లి విచారించి, తనిఖీ చేయగా అతని వద్ద ఉన్న బ్యాగ్ లో మొత్తం 6.085 కిలోల ఎండు గంజాయి లభించిందని దాని విలువ దాదాపు 3,10,000/- రూపాయలు ఉంటుందని వెంటనే పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితుడి వివరాలు తెలుసుకోగా అతని పేరు సయ్యద్ షారుఖ్ జాకీరుద్దీన్ అహ్మద్ తండ్రి జాకీరుద్దిన్, 29 ఊరు దత్ టెంపుల్, చంద్రాపూర్, మహారాష్ట్ర అని తెలిపి, అతను అక్రమంగా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉదేశ్యంతో ఒరిస్సా కి చెందిన జితేంద్ర కుమార్ అను వ్యక్తి దగ్గర గంజాయిని తక్కువ ధరకి కొని ఎక్కువ ధరకి అమ్ముకునేవాడు. అట్టి వ్యక్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్ కి పంపగా జితేంద్ర కుమార్ అనే నిందితుడు పరారిలో ఉన్నట్లు తెలియజేశారు.



## ప్రభుత్వాలు ప్రజల కోసమే పని చేయాలి

### తెలుగుశక్తి అధ్యక్షుడు బివి రామ్



వేంపల్లె (**కదిలించే వార్త) మే 27:** కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వారి ఆర్థిక ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల కోసం మాత్రమే పని చేయాలి తెలుగుశక్తి రాష్ట్ర అధ్యక్షుడు బివి రామ్ పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి సమక్షంలో తెలుగు శక్తి రాష్ట్ర అధ్యక్షుడు బివిరామ్ బొబ్బిలి పులి ఆడియోను క్యాసెట్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో బొబ్బిలి పులి ఆడియోను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలను చైతన్య పరచడం కోసమే బొబ్బిలి పులి ఆడియోను విడుదల చేసినట్లు చెప్పారు. 77 ఏళ్ల స్వాతంత్ర దేశంలో ప్రజలు ఇంకా బానిసలుగా ఉన్నారని చెప్పారు. అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ప్రజలను బిచ్చగాళ్లుగా మారుస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు ప్రజాసేవకులుగా ఉండి పార్టీలకు, కుల మతాలకు అతీతంగా సేవలు అందించాలని కోరారు. ప్రజాప్రతినిధులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలి అన్నారు. తెలుగు శక్తి మంచి పరిపాలన అందిస్తున్న వారికే కొమ్ము కాస్తానని అన్నారు. ప్రజల్లో మార్పు కోసమే తాను బొబ్బిలిపులి చైతన్య యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలో కూడా ప్రజలు సంతోషంగా లేరని చెప్పారు. అధికారుల మైండ్ సెట్ కూడా మారాలని కోరారు. ప్రజలు కట్టిన పన్నులతోనే అధికారులకు జీతాలు వస్తున్న విషయం గుర్తుపెట్టుకోవాలని కోరారు. అన్యాయాన్ని ప్రశ్నించడం కోసమే తాను బొబ్బిలిపులి ఆడియోను ప్రజల్లోకి తీసుకెళ్లుతున్నట్లు చెప్పారు. పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించి పోటీ చేసే అభ్యర్థులు ఇచ్చే తాయిలాలు తీసుకోవడం వ్యతిరేకించాలని కోరారు. బొబ్బిలిపులి జైత్రయాత్రకు తాను పూర్తి మద్దతు ఇస్తున్నట్లు పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం బి.వి.రామ్ చేపట్టిన బొబ్బిలిపులి ఆడియో విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకొంటున్నట్లు చెప్పారు. బొబ్బిలిపులి ఆడియో ఆవిష్కరణ ముందు గండి క్షేత్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామిని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ దర్శించుకున్నారు. బొబ్బిలిపులి ఆడియో ఆవిష్కరణలో పులివెందుల ఇన్ ఛార్జ్ ధృవకుమార్ రెడ్డి, అడ్వకేట్ ఎం.వి బాలిరెడ్డి, తిరుపాల్ రెడ్డి, డాక్టర్ సుబ్రమణ్యం, రామకృష్ణ, వేమరాజ, వెంకటేష్, వేమయ్య, నాగరాజు, అమర్, ఉత్తన్న, నాగరాజు పాల్గొన్నారు.

# ఒత్తిడి నుండి ఉపశమనానికి యోగానే మార్గం

## మున్సిపల్ కమిషనర్ రాముడు



పులివెందుల **(కదిలించే వార్త) మే 27:** ఒత్తిడి నుండి ఉపశమనానికి మరియు మానసిక ఉల్లాసానికి యోగా కార్యక్రమాలు దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ రాముడు పేర్కొన్నారు. బుధవారం భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం లో భాగంగా మున్సిపల్ కమిషనర్ రాముడు యోగా గురువు వెంకట రామిరెడ్డి తో కలిసి స్థానిక వై.యస్.ఆర్.మెమోరియల్ పార్క్ నందు వార్డు సచివాలయ సిబ్బంది కి మరియు పురపాలక నీటి సరఫరా సిబ్బందికి యోగా గురించి తెలియ చేస్తూ యోగా శిక్షణా కార్యక్రమాలు అనంతరం సిబ్బంది చేత యోగా ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ యోగ అభ్యసనం చేయడం ద్వారా శారీరక మానసిక ఆరోగ్యం, ఏకాగ్రత ఒత్తిడిని ఎదుర్కొనే శక్తి సాధించడానికి యోగ ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

# కడపలో కన్నుల పండుగగా మహానాడు

## ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



కడప,**(కదిలించే వార్త) మే 27:** కడప గడపలో కన్నుల పండుగగా ప్రారంభమైన మహానాడులో అనంతపురం పార్లమెంట్ స్టాల్ లో ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని మహానాడు కిట్ ను అందుకుని నియోజకవర్గ టిడిపి, నాయకులు కార్యకర్తలతో కలిసి హాజరైన అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్

# చౌక ధర దుకాణాల వద్దనే రేషన్ పంపిణి

## జిల్లా జాయింట్ కలెక్టర్ :అభిషేక్ కుమార్



పుట్టపర్తి, **(కదిలించే వార్త) మే 27:** ఆంధ్ర ప్రదేశ్ వారి ఉత్తర్వుల మేరకు ప్రజా పంపిణీ వ్యవస్థ రేషన్ షాప్ ల ద్వారా రేషన్ పంపిణీని పునఃప్రారంభించనున్నారు. జూన్ 1 నుండి, రేషన్ సరసమైన ధరల దుకాణాల ద్వారా మాత్రమే సరఫరా చేయబడుతుంది. ఇవి ప్రతి నెల 1 నుండి 15 వరకు తెరచి ఉంటాయి అని జిల్లా సంయుక్త కలెక్టర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు జిల్లాలో 5,66,057 రేషన్ కార్డులు కలిగిన రేషన్ కార్డుదారులు అందరు రేషన్ ను జూన్ 1 నుండి రేషన్ షాప్ లోనే నిత్యవసర సరుకులు తీసుకోవాలని తెలిపారు జిల్లా సంయుక్త కలెక్టర్ వారి సూచనలు: 1. సత్యసాయి జిల్లాలోని డీలర్లు అందరు ప్రతి నెల 1 నుండి 15 వరకు తెరచి రేషన్ పంపిణి చేయాలి . 2. షాపు డీలర్లు సరఫరా చేసిన ల కోసం కార్డ్ హోల్డర్ల నుండి అదనపు వసూలు చేయకూడదు, చెల్లింపును ఉపయోగించాలి. 3. సరసమైన ధరల దుకాణ డీలర్లు కార్డుదారులకు అర్హత ప్రకారం పూర్తిగా వస్తువులు జారీ చేయబడతాయని నిర్ధారించుకోవాలి మరియు ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువ బరువు ఉండకూడదు. 4. దుర్బల లబ్ధిదారుల కోసం వాట్సాప్ గ్రూపులు: డీలర్లు ప్రత్యేకంగా సీనియర్ సిటిజన్లు (65౦) మరియు శారీరకంగా వికలాంగులైన కార్డ్ హోల్డర్ల కోసం పంపిణీ షెడ్యూల్‌లను సమన్వయం చేయడానికి మరియు కమ్యూనికేట్ చేయడానికి ఒక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి, సమర్థవంతమైన సేవను అందించాలి . 5. సీనియర్ సిటిజన్లు (65౦) మరియు శారీరకంగా వికలాంగులైన కార్డుదారులకు షాప్ డీలర్లు ఆ కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయవలెను. జిల్లా సంయుక్త కలెక్టర్ వారు జిల్లాలోని రేషన్ కార్డుదారులు అందరికి రేషన్ పంపిణి ని షాప్ లు ద్వారా పునఃప్రారంభం నేపథ్యంలో ఎటువంటి అంతరాయము లేకుండా అందించేలా సకాలములో చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ లు మరియు మండల సహాయ పౌర సరఫరా అధికారులు మరియు రేషన్ సరసమైన ధరల దుకాణాల డీలర్లు కు ఈ సూచనలుతప్పక పాటించాలని జాయింట్ కలెక్టర్ పై ప్రకటనలో తెలిపారు.


# ఆయా మండలాలలో భూ సేకరణకు సంబంధించిన పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలి .

## జిల్లాకలెక్టర్ టి. ఎస్. చేతన్



పుట్టపర్తి, **(కదిలించే వార్త) మే 27:**జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణకు సంబంధించి అన్ని పనులను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎన్.హెచ్ 342 , ఎన్ హెచ్ 716 జి ,జాతీయ రహదారులు, వివిధ భూ సేకరణ సంబంధించిన పనుల పురోగతిపై సంబంధిత శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారుఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ కేటాయింపు ప్రతిపాదనలపైన వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి నియమ నిబంధనల మేరకు నివేదికలను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు మరియు సంబంధిత అధికారులు కలెక్టర్ కార్యాలయానికి నివేదికల అందజేయాలని ఆదేశించారు 342:ప్యాకేజీ బుక్క పట్నం మండలం బుచ్చెగారిపల్లి భూ సేకరణకు సంబంధించిన పనులపై సమీక్షించారు. ముదిగుబ్బ మండలం దొరిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల గోడ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్యాకేజీ 2:పుట్టపర్తి మండలం అమగొండ పాళెం గ్రామం మరియు చెల్లింపు పెండింగ్‌లో సమీక్షించారు.ఎలాంటి పెండింగ్లో లేకుండాసత్వరమే పూర్తి చేయాలి అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉన్నచో భారత జాతీయ రహదారుల అథారిటీ వారు సంబంధిత తహసీల్దార్ లతో మరియు రెవెన్యూ డివిజన్ అధికారులతో సమన్వయ సహకారం చేసుకుంటూ వాటిని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పెనుగొండ ఆనంద్, పుట్టపర్తి సువర్ణ, కదిరి శర్మ, ధర్మవరం మహేష్ ఎన్ హెచ్ ఎ ఐ పిడి బి అశోక్ కుమార్, కే మల్లికార్జునరావు, బి నాగరాజు, గిడ్డయ్య, ల్యాండ్ అక్విజేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు

# అధిక ధరలు!? పరిహారం తప్పదు



అనంతపురం జిల్లా, **(కదిలించే వార్త) మే 27:** జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం శ్రీలత, సభ్యుడు బి గోపీనాథ్ ల తో కూడిన ధర్మాసనం ఆదేశాల మేరకు ఎమ్మార్పీ ధర కన్నా అధికంగా వసూలు చేశారని దాఖలైన రెండు వేర్వేరు ఫిర్యాదులలో ప్రతివాదులు 50 వేల రూపాయలు చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధికి మొత్తం లక్ష రూపాయలను చెల్లించారు. అనంతపురం పోస్టల్ శాఖ క్వార్టర్లలో నివసిస్తున్న జీ రమేష్ బాబు దాఖలు చేసిన రెండు వేరు వేరు ఫిర్యాదులలో వినియోగదారునికి పరిహారం చెల్లించటం తో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధికి 50000 రూపాయలు చొప్పున చెల్లించాలని వినియోగదరుల న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయటం విశేషం. ఫిర్యాదుదారుడు జీ రమేష్ బాబు, 05.06.2023 న తన ద్విచక్ర వాహనం కోసం "టర్న్ సిగ్నల్ ల్యాంప్ " ను రామచంద్ర నగర్ లోని ఒక ప్రైవేట్ సంస్థ లో కొనుగోలు చేశాడు. ప్యాక్‌పై రూ.143/- మాత్రమే (అన్నీ పన్నులతో కలిపి) ఉండగా బిల్లులో రూ.159/- వసూలు చేశారని ఫిర్యాదిదారు నిరూపించడంతో కంటే ఎక్కువ వసూలు చేసిన కారణంగా ఫిర్యాదిదారుకు అదనంగా వసూలు చేసిన రూ.16/- తిరిగి చెల్లించాలనీ మానసిక వేధింపులకు పరిహారంగా రూ.10,000/- న్యాయ ఖర్చుల కోసం రూ.3,000/- చెల్లించాలనీ ఆదేశిస్తూ, అదనంగా జరిమానాగా లిరూ.50,000/-లిను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి చెల్లించాలనీ జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా రామచంద్ర నగర్ లోని ఒక దుకాణ సంస్థలో కొనుగోలు చేసిన వస్తువు సంతూర్ ధర 60 రూపాయలు కాగా 68 రూపాయలు వసూలు చేశారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. కంప్యూటర్లో నమోదైన ధరల ఆధారంగా వసూలు చేశామని, పాత కవర్ దాఖలు చేసి అక్రమ ఆర్జన కోసం అర్జీ దాఖల చేస్తున్నారని సదరు సంస్థ బదులిచ్చింది. ఆధారాలన్నీ అధిక మొత్తాన్ని వసూలు చేసినట్టు రుజువు చేయటంతో ఫిర్యాదుదారునికి వసూలు చేసిన అధిక మొత్తాన్ని తిరిగి చెల్లించడంతోపాటు 10,000/-రూపాయలు మానసిక వేదనకు, 3000/బి రూపాయలు న్యాయ ఖర్చులకు చెల్లించాలని ,అదనంగా నిర్ణయించిన ధర కన్నా అధికంగా వసూలు చేసిన నేరం కింద 50వేల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధికి చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. ఈ రెండు ఫిర్యాదులలోను ప్రతివాదులు ఫిర్యాదు దారుడికి నష్టపరిహారాన్ని చెల్లించినట్టుగా తెలియజేశారు అదనంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి విధించిన 50 వేల రూపాయలు ను వినియోగదారుల కమిషన్ లో డిపాజిట్ చేశారని,వెంటనే ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేస్తామని కమిషన్ అధ్యక్షులు ఎం శ్రీలత పేర్కొన్నారు.

# నా తెలుగు కుటుంబం రాష్ట్ర భవిష్యత్ ను మారుస్తుంది

నారా లోకేష్ ఆలోచనలు ఆరు శాసనాల్లో స్పష్టంగా తెలిపారు

మార్పు దిశగా నారా లోకేష్ తొలి అడుగు వేశారు

నా తెలుగు కుటుంబంపై ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందన










కడప, **(కదిలించే వార్త) మే 27:** ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అడుగులు వేస్తున్నారని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మహానాడు వేదికగా నారా లోకేష్ ప్రకటించిన ఇది నా తెలుగు కుటుంబం పై ఆయన స్పందించారు. కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మంత్రులు, సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టిడిపి నాయకులతో కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా అనంతపురం స్టాల్ నందు తన సభ్యత్వ కార్డును నమోదు చేసుకుని కిట్ అందుకొని మహానాడు కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగుప్రజల కోసమే తెలుగుదేశం పార్టీ పుట్టిందని ఆ రోజు ఎన్టీఆర్ దగ్గర నుంచి మా పార్టీ అధినేత చంద్రబాబు, ఇప్పుడు నారా లోకేష్ కూడా అదే సిద్ధాంతంతో పని చేస్తున్నారన్నారు. అయితే మారుతున్న కాలానికి అణుగుణంగా పార్టీ ప్రాథమిక సిద్ధాంతాలకు ఏమాత్రం ఆటంకం కల్గించకుండా ప్రజలకు మెరుగైన సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే నారా లోకేష్ నా తెలుగు కుటుంబం పేరుతో ఆరు శాసనాలను ప్రటించారన్నారు. ఇది మార్పు దిశగా వేసిన తొలి అడుగు అన్నారు. తెలుగు జాతి విశ్వ ఖ్యాతి, పేదల సేవలో- సోషల్ రీఇంజినీరింగ్, స్త్రీ శక్తి, అన్నదాతకు అండగా, యువగళం, కార్యకర్తే అధినేత ఈ ఆరు శాసనాలు రాష్ట్ర భవిష్యత్ ను మార్చనున్నాయన్నారు. యువగళం పాదయాత్రలో ఎన్నో రోజుల పాటు ప్రజల మధ్య ఉండి తెలుసుకున్న అంశాల ఆధారంగా.. వారికి ఏం చేస్తే బాగుంటుందన్నది ఆలోచించి వీటిని తీసుకొచ్చారన్నారు. ఇప్పటికే కార్యకర్తల సంక్షేమం కోసం 5లక్షల ఇన్సూరెన్స్ వంటి తీసుకొచ్చారన్నారు. కార్యకర్తలు లేనిదే పార్టీ లేదన్న ఉద్దేశ్యంతోనే వారికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ..కార్యకర్తలే అధినేత అన్నది తీసుకొచ్చారన్నారు. ఓ వైపు రాష్ట్ర ప్రజల అభ్యున్నతితో పాటు కార్యకర్తల గురించి కూడా అంతే చిత్తశుద్ధితో ఆలోచిస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# జగన్మోహన్ రెడ్డి మాకు కౌంట్ కూడా కాదు

జగన్ ఆల్రెడీ ఒక చచ్చిన పాము..

ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంత నుంచి మహానాడుకు భారీ కాన్వాయ్ తో బయలుదేరిన దగ్గుపాటి

15వేల మంతో బహిరంగ సభకు హాజరవుతామన్న ఎమ్మెల్యే







అనంతపురం అర్బన్,**(కదిలించే వార్త) మే 27:** జగన్మోహన్ రెడ్డి మాకు కౌంట్ కూడా కాదని అతను ఒక చచ్చిన పాము అని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కామెంట్ చేశారు. మంగళవారం నుంచి కడప వేదికగా జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి ఆయన భారీ కాన్వాయతో బయలుదేరారు. అర్బన్ టిడిపి కార్యాలయం నుంచి ఈ ర్యాలీని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రారంభించారు. జై చంద్రబాబు.. జై నారా లోకేష్ అంటూ కాన్వాయ్ ముందుకు కదిలింది. తొలి రోజు కేవలం కొద్ది మంది ఆహ్వానితులతో మాత్రమే మహానాడుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ గతంలో కరోనా, ఇతర పరిస్థితులను దృష్ట్యా తాము మహానాడును ఘనంగా నిర్వహించలేకపోయామన్నారు. ఈసారి జగన్ రెడ్డి ఇలాకాలో భారీ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్బన్ నియోజకవర్గం నుంచి 15వేల మందికి తక్కువ కాకుండా ఈ కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. బహిరంగ సభకు భారీ స్థాయిలో ఏర్పాట్లు కూడా చేసినట్లు చెప్పారు. కార్యకర్తలకు, నాయకులు ఏ కష్టం వచ్చినా ముందుండే పార్టీ తెలుగుదేశం అన్నారు. ఇటీవల ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి, బావ ప్రమాదానికి గురైతే.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి స్పెషల్ ఫ్లైట్లు వేశారని గుర్తు చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో కోటి సభ్యత్వాలు చేశామని ఇది ఏ ప్రాంతీయ పార్టీకి లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు ఎప్పటికీ తమ ప్రభుత్వం చేయదని ఆయన స్పష్టం చేశారు. గతంలో సభలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలంటే పరదాలు కట్టడం, చెట్లు కొట్టడం వంటివి చేసేవారని అలాంటి అవసరం తమకు లేదన్నారు. మేము ఏ కార్యక్రమం చేసినా బహిరంగంగా ప్రజల మధ్యనే చేస్తున్నామన్నారు. జగన్ రెడ్డిని టార్గెట్ చేయాల్సిన అవసరం తమకు లేదని ఆయనకంత సీన్ కూడా లేదని దగ్గుపాటి అన్నారు. తెలుగుదేశం పార్టీ సత్తా ఏంటన్నదే మహానాడు ద్వారా మరోసారి చూపిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# ఉపాధ్యాయూల ప్రమోసన్ల పై కక్షిసాధిపు చర్యలు ఆపండి



అనంతపురం,**(కదిలించే వార్త) మే 27:** అనంతపురం జిల్లా విద్యాశాఖలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల లో ఎస్సీ ఎస్టీ స్కూల్ అసిస్టెంట్లకు అన్యాయం జరిగిందని జీవో నెంబర్ 2 ప్రకారం రోల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా అన్యాయంగా ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు నిర్వహించాలని చూస్తున్నారని. ఈరోజు 360 మంది స్కూల్ అసిస్టెంట్లను వెరిఫికేషన్ కోసం పిలిచిన విద్యాశాఖ ఎస్సీ, ఎస్టీల గురించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. 2023లో హెడ్మాస్టర్లు ఎంఈఓ టూలు గా కన్వర్షన్ కావడం జరిగినది. ఆ వెంటనే రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారము ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయ పోస్టులను ఫిలప్ చేయడం కూడా జరిగినది. కానీ ప్రస్తుతం జరుగుతున్న 120 పోస్టుల పదోన్నతులలో ఎస్సీ, ఎస్టీలకు అరే కోసి పూర్తి అయిందని విద్యాశాఖ వర్గాలు నిర్లక్ష్యంగా సమాధానము ఇవ్వడం జరుగుతున్నది. కాబట్టి కూటమి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ పక్షాన నిలబడే ప్రభుత్వం అయినందున వెంటనే ఈ అంశం పైన దృష్టి సారించి ఎంఈఓ 2 పోస్టు వేరే కేటగిరీకి చెందినది అయినందువలన వాటిని కౌంట్ చేయకుండా 120 ప్రధానోపాధ్యాయుల పోస్టుల్లో రూరల్ రిజర్వేషన్ ప్రకారం రావలసిన 25 పోస్టులను ఎస్సీ ఎస్టీ స్కూల్ అసిస్టెంట్లకు కేటాయించి న్యాయం చేయవలసిందిగా డిమాండ్ చేయడం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శ్రీ .ఎల్లన్న, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్. రామచంద్ర, రిజర్వేషన్ పరిరక్షణ సమితి జీవీ ఉజ్వల్ ఎస్సీ ఎస్టీ ఫోరం రామాంజనేయులు మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నరేష్ పాల్గొన్నారు.

# సరస్వతినది పుష్కరాలలో సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో 1679 మంది ఆత్మ బంధువులకు పిండప్రదాన కార్యక్రమం



అనంతపురం, **(కదిలించే వార్త) మే 27:** ప్రస్తుత పరిస్థితులలో మానవత్వం పూర్తిగా మాయమై పక్కవాన్ని కూడా పట్టించుకోని పరిస్థితులలో మానవ సంబంధాలు అన్ని మనీ సంబందాలుగా మారుతున్న సమయం లో సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పవిత్ర సరస్వతి నది పుష్కరాలలో తెలంగాణ రాష్ట్రం జయశంకర్ భూపాలంపల్లి జిల్లా లోని మహదేవపురం మండలం కాలేశ్వరం అర్జున గుట్ట సరస్వతీ నది నది వద్ద దాదాపు 1679మందికి పిండ ప్రధాన కార్యక్రమం నిర్వహించారు వివరాల్లోకి వెళ్ళితే వివిధ సందర్భంగాలలో మృతి చెందిన ఆత్మ బందువులు ఏ ఒక్కరు ముందుకు రాకపోవడంతో అన్ని తామై వారి వారి సంప్రదాయాలను అనుసరించి సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో పూడ్చడంలేదా కాల్చడం సాంప్రదాయ పద్దతిలో నిర్వహించారు. అంతటితో ఆగ కుండ వారందరికీ ఉత్తమ గతులు కలగాలని అకాల మరణం చెందినా వారి ఆత్మలకు శాంతి కలగాలని పవిత్ర సరస్వతి నది పుష్కరాలలో



గోదావరి ,ప్రాణహిత,సరస్వతినదుల సంగమం వద్ద 1679 మందికి వారి వారి పేరులతో 2 రోజుల పాటు ఆస్తి నిమజనం ,పిండ ప్రదానం,. ఆకాల మరణం పొందిన వీరందరికీ కైవల్యం ప్రసాదించాలని నారాయనబలి హోమం, అత్యేష్టి హోమం, తిల తర్పణలు, గోదానం, భూదానం, సువర్ణ దానం, తదితర దానాల కార్యక్రమాలను సాంప్రదాయ పద్దతిలో గుంటూరు కు చెందినా ప్రముఖ పురోహితుడు నాగేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహిచమని అనంతరం బ్రహ్మనులకు వివిధ రకాల దానాలను అందించి అన్నప్రసాద వితరణ చేసామని సాయి ట్రస్ట్ అద్యక్షుడు విజయసాయి కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ అనిల్ కుమార్ హైదరాబాద్ చెందిన హర్షిత్ తేజ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానంలో అమావాస్య ప్రత్యేక పూజలు





కసాపురం,**(కదిలించే వార్త) మే 27:** 27.5.25 కసాపురం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనారాయణ స్వామి రాతి దేవస్థానంలో శ్రీ లక్ష్మీనారాయణ స్వామి వారికి ఆలయ అర్చకులు ఈరోజు అమావాస్య కావున ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ అలాగే శనీశ్వర జయంతి పురస్కరించుకొని శివకేశవులకు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి నల్లని నువ్వులు అర్చకులకు ధర్మకర్త దానం చేయడం జరిగినది కర్ణాటక ఆంధ్ర రాష్ట్ర నలుమూలల నుండి వివిధ జిల్లాల స్వామి అమ్మవార్ల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగినది అనంతరం ఆలయ ధర్మకర్త తలారి పరుశురాముడు మాట్లాడుతూ ప్రతి అమావాస్య పౌర్ణమి ఏకాదశి లకు పెద్ద సంఖ్యలో భక్తులు రావడం స్వామి అమ్మవారి దర్శనం చేయడం ఈరోజు పెద్ద సంఖ్యలో అన్న ప్రసాద వికరణలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించడం జరిగినది వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు మాట్లాడుతూ ఇంత పెద్ద శ్రీ లక్ష్మీనారాయణ స్వామి క్షేత్రం రావటం మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు చేసుకున్న పుణ్యం ప్రశాంతత మనసుకు శాంతి కలుగుతుంది స్వామి అమ్మవార్ల ముఖ కవళికలు ఎంతో తేజస్వంతంగా ఉండటం ఉప ఆలయాలలో ఉన్న ప్రతి స్వాములు వారి విగ్రహాలు ఎంతో అపురూపంగా విశేషంగా ఉండడం ఇలాంటి దేవస్థానం ఎక్కడా లేదన్నారు అర్చకులు మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన ఆలయంగా భక్తుల కోరిన కోరికలు తీరుస్తున్న స్వామి అమ్మ వార్ల ఆశీస్సులు అందరూ పొందాలని దేవస్థానం అన్నదాన ప్రసాద వితరణలో శాశ్వత సేవలో ప్రజలు భక్తులు అందరూ భాగస్వామ్యం కావాలని ఇది అందరి దేవాలయం అని అన్నారు ఈ కార్యక్రమంలో మురళి మల్లికార్జున స్వామి భక్తులు మహిళలు పాల్గొన్నారు.

# ఏపీ మోడల్ లాసెట్ పోస్టర్ విడుదల :సాకేనరేష్




అనంతపురం **(కదిలించే వార్త) మే 27:** ఏపీ బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జూన్ 1న నిర్వహించబోయే మోడల్ లాసెట్ పోస్టర్ ను అనంతపురం బార్ అసోసియేషన్ లో న్యాయవాదులు విడుదల చేశారు ఈ సందర్భంగా బిసి న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకేనరేష్ మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ మోడల్ లాసెట్ నిర్వహిస్తున్నామని ఇది 9వదని దీని ద్వారా ప్రధాన లాసెట్ రాసే అభ్యర్థులకు ఉపయోగకరంగా ఉంటుందని గతంలో నిర్వహించిన మోడల్ లాసెట్ ప్రశ్నపత్రం లోని అంశాలు ప్రధాన పరీక్షలో వచ్చాయని దానివల్ల ఎంతోమంది లబ్ది పొందారని తెలిపారు కనుక లాసెట్ రాసే అభ్యర్థులు తమ పేర్లు 9441888834, 9985302299, 7799912225 నంబర్స్ కి ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని ఈ పరీక్ష జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నెహ్రూ స్కూల్ లో ఉదయం 10 గం. నుంచి 11.30గం., వరకు జరుగునని తెలిపారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రంగనాయకులు,బాలాజీ నాయక్, మురిపాల నాగేంద్ర, లక్ష్మీనారాయణ, రఘు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

